ప్రజాశక్తి

బుధవారం 13 మార్చి 2024 8 పేజీలు





గుంటూరు పల్నాడు

ఎన్నికల వేళ కొత్త వివాదం

సిఎఎ అమలుపై ముస్లిమ్ సంఘాల ఆగ్రహం - వైసిపి నేతల్లో తర్జన భర్జన - అధిష్టానం నిర్ణయం కోసం ఎదురుచూపు



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వివాదస్పద పౌరసత్వ సవరణ చట్టాన్ని (సిఎఎ)ను తక్షణం అమలులోకి తెస్తూ ఇచ్చిన ఆదేశాలలో ప్రజల్లో తీవ్ర చర్చకు దారితీసింది. పార్లమెంటులో బిల్లు ఆమోదం సమయంలోనే కాంగ్రెస్, వామపక్షపార్టీలు ఈ చట్టాన్ని వ్యతిరేకించాయి. ఒకటి రెండు రోజుల్లో ఎన్నికల షెడ్యూలు ప్రకటనకు ముందే ఈ చట్టం అమలుకు నోటిఫై చేయడాన్ని ముస్లిమ్ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కేంద్రం సవరించిన సిఎఎ నిబంధనలను నోటిఫై చేయడంలో ఆంతర్యం ఏమిటని ముస్లిమ్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఇతర దేశాల నుంచి వచ్చిన ముస్లిములకు పౌరసత్వం కల్పించబోమని నిబంధనల్లో పేర్కొనడంపై ముస్లిమ్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఈ చట్టం అమలు వల్ల తమకు ఎంత మేరకు నష్టం ఉంటుందని అంశంపై వైసిపి, టిడిపిలో తర్జన భర్జనలు జరుగతున్నాయి. ఈ అంశంపై ఎలా స్పందించాలనే అంశంపై వైసిపి అధిష్టానం ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. బిజెపితో పొత్తు కుదుర్చుకోవడంతో ఈ అంశంపై టిడిపి, జనసేన నాయకులు మాట్లాడేందుకు నిరాకరిస్తున్నారు. ఈ చట్టం అమలుకు పార్లమెంటులో అనుకూలంగా ఓటు వేసిన వైసిపి, టిడిపి కేంద్రం తీసుకున్నజ తాజా నిర్ణయంపై మౌనం వహిస్తున్నారు.

రాజ్యాంగ విరుద్ధం : ఎం.ఎ.చిష్టి



మతం ఆధారంగా పౌరసత్వ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమని ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఎ.చిష్టి పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో మత విభజనలు సృష్టించి రాజకీయ లబ్ధిపొందాలని నరేంద్రమోడీ ప్రయత్నిస్తున్నారని అన్నారు. సిఎఎ చట్టం దేశంలో ముస్లిములను ద్వితీయ శ్రేణి పౌరులుగా పరిగణించే కుట్రలో భాగమేనని అన్నారు. పదేళ్లుగా మోడీ ప్రభుత్వం అవలంభిస్తున్న నిరంకుశ పరిపాలనలో భాగంగా యూసిసి, ఎన్ఆర్‌సి, సిఎఎ వంటి వివాదస్పదమైన అంశాలను తెరపైకి తెచ్చి ప్రజల దృష్టిని మరల్చడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. సిఎఎపై రాష్ట్రంలో అధికార, ప్రతిపక్షపార్టీలు తమ వైఖరిని స్పష్టం చేయాలన్నారు. కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రుల మాదిరిగానే సిఎంజగన్ కూడా స్పందించాలన్నారు. ముస్లిం, మైనార్టీలకు ద్రోహం చేసే చట్టాన్ని సమర్ధిస్తూ బిజెపికి అంటకాగే పార్టీలకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని తెలిపారు.

రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలి : మస్తాన్ వలి



భారత జాతిని కులం,మతం పేరుతో విభజించేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి చెప్పారు. దేశంలో ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు సిఎఎ చట్టాన్ని అమలు చేయడానికి హడావుడిగా ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. గుంటూరులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక హిమనీ సెంటర్‌లో గాంధీ విగ్రహం వద్ద జరిగిన నిరసనలో ఆయన మాట్లాడారు. 2019లో ఆమోదించిన సిఎఎ చట్టాన్ని ప్రజా వ్యతిరేకతతో పక్కన పెట్టిన కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు ఎన్నికల ముందు అమలుకు పూనుకోవడం దేశ ప్రజలలో అలజడి సృష్టించేందుకు ప్రయత్నించడమే అవుతుందన్నారు. కులాలకు, మతాలకు అతీతంగా జీవిస్తున్న ప్రజల మధ్య విద్వేషాలు రగిలిస్తున్నారని అన్నారు. ఈవిషయంపై రాష్ట్రపతి, సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం ఇతర దేశాల నుంచి వచ్చిన

▶ 2లో



క్యాండిల్ ర్యాలీలో ఎమ్మెల్యే, మంత్రి, ఎంపీతో గీతాంజలి భర్త

గీతాంజలికి నివాళిగా క్యాండిల్ ర్యాలీ

ప్రజాశక్తి - తెనాలి

సోషల్ మీడియా వేధింపుల కారణంగా మృతి చెందిన గొల్తి గీతాంజలికి నివాళిగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి విడుదల రజని, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, మృతురాలి భర్త చంద్రశేఖర్‌తో పాటు పట్టణంలోని పలువురు మహిళలు, వైసిపి కార్యకర్తలు, గీతాంజలి కుటుంబ సభ్యులు ర్యాలీలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గీతాంజలి మృతి

▶ 2లో



ఆడపిల్లను అదృష్టంగా భావించాలి

మహిళా దినోత్సవంలో పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆడపిల్ల పుట్టడాన్ని ప్రతిఒక్కరూ అదృష్టంగా భావించాలని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని ప్రకాష్‌నగర్ షాదీఖానాలో మంగళవారం మహిళా దినోత్సవాలు యుటిఎఫ్, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ, ప్రజాతంత్ర మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రామిక మహిళా

▶ 2లో



వరికపూడిసెల పనులకు ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

పల్నాటి ప్రజల 70 ఏళ్ల కల వరికపూడిసెల నిర్మాణ పనులను నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ వైసిపి అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు బొల్లా బ్రహ్మనాయుడు, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైసిపి రాష్ట్ర యువజన విభాగ ఉపాధ్యక్షులు వెంకట్రామిరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ దాదాపు 1.24 లక్షల ఎకరాలకు సాగునీరు, అనేక గ్రామాలకు తాగునీరు అందించే ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. ఈ ప్రాంతంలో పొలాలు ఎవరూ అమ్ముకోవాల్సిన అవసరం లేదని, ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతాయని చెప్పారు. వైసిపి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి మరోసారి ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు ఎక్కడ..? పనులు ఎక్కడ..?

నటనలతో మరోసారి మోసం చేయొద్దు : సిపిఎం, సిపిఐ

ప్రజాశక్తి - వినుకొండ

రాజకీయ ప్రయోజనాల కోసం వరికపుడిశెల ప్రాజెక్టును శంకుస్థాపనలు, పనుల పర్యవేక్షణల పేరుతో పల్నాడు ప్రజలను మోసం చేయొద్దని సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, సిపిఎం పల్నాడు జిల్లా కమిటీ సభ్యులు హనుమంతరెడ్డి అన్నారు. ఈ మేరకు స్థానిక సిపిఎం కార్యాలయంలో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజల్ని మరోసారి మోసం చేయడానికి వైసిపి ప్రజాప్రతినిధులు సిద్ధమయ్యారని, పనులు చేపట్టాల్సిన అటవీ ప్రాంతంలో కాకుండా రైతుల పొలాల్లో పొక్లెయినర్‌ను తీసుకెళ్లి గుంతలు తీయించి పనులు చేస్తున్నట్లు నటిస్తున్నారని విమర్శించారు. అటవీ శాఖకు చెల్లించాల్సిన డబ్బు చెల్లించకుండా, క్యాబినెట్ మీటింగ్‌లో ప్రాజెక్టుకు నిధులు కేటాయించకుండా పనులు ప్రారంభిస్తున్నట్లు చెప్పడం అంటే ఓట్ల కోసం ప్రజల్ని మళ్లీ మోసం చేయడం కాదా? అని నిలదీశారు. ప్రభుత్వం ఇప్పటికైనా నటనలు మానకుని ప్రాజెక్టు పనులకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న సిపిఐ, సిపిఎం నాయకులు



తెగులు సోకిన నరసరావుపేట మండలం అర్వపల్లిలోని తోట

మామిడి పూతకు తెగుళ్ల వాత

- రాలిపోతున్న పూత, పిందె - ఆందోళనలో రైతులు
- దిగుబడి తగ్గి వినియోగదార్లకు మరింత ప్రియం కానున్న ధరలు

▶ 4లో



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధవారం సాయంత్రం) : 6.23

సహరీ (గురువారం ఉదయం) : 5.01

ఎన్నికల వేళ కొత్త వివాదం

(మొదటి పేజీ తరువాయి)

ముస్లిములకు పౌరసత్వం ఇవ్వబోమని చెబుతున్న ప్రభుత్వం భవిష్యత్తులో క్రిస్టియన్‌లకు కూడా ఇదే నిబంధన వర్తింపచేయదని గ్యారంటీ ఏముందని ప్రశ్నించారు. దేశంలో ముస్లిములను మోడీ ప్రభుత్వం ద్వితీయ శ్రేణి పౌరులుగా చూస్తోందన్నారు.

అందరికీ ఒకే విధానం ఉండాలి : కలీం



ఇతర దేశాల నుంచి వచ్చిన వారు ఏ మతస్తులైనా పౌరసత్వం కల్పించే విషయంలో ఒక్కటే విధానం అవలంభించాలని ముస్లిమ్ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షులు మహమ్మద్ కలీం కోరారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్గనిస్తాన్ నుండి 2014 డిసెంబర్ 31 నాటికి వలస వచ్చిన హిందువులు, క్రైస్తవులు ,సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్సీలకు, భారత పౌరసత్వం అందించాలని మోడీ ప్రభుత్వం చేసిన సిఎఎ-2019 చట్టంపై ప్రజల్లో అనేక భయాలు ఉన్నాయన్నారు. సిఎఎ అమలుకు ముందు పొరుగు దేశాలైన మయన్మార్, శ్రీలంకలో మైనార్టీలైన తమిళులు, ముస్లిములు మత హింసకు గురవుతున్న విషయాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం దృష్టిలో పెట్టుకోవాలని కోరారు.ముస్లిమేతరుల బాధలనే గాక, పొరుగు దేశాల్లో మైనార్టీలుగా ఉన్న తమిళులు, ముస్లిములకు కూడ సరైన న్యాయం జరిగే విధంగా జాతీయ పౌరసత్వ సవరణ చట్టం అమలుకు జారీ చేసే నిబంధనలో పొందు పరచాలన్నారు. పొరుగు దేశాల్లో మైనార్టీలుగా ఉన్నవారికి ఎక్కడ అన్యాయం జరిగినా వారిని ఆదుకునేందుకు చేసిన చట్టంలో శ్రీలంక, మయన్మార్‌లలో మైనార్టీలుగా ఉన్న వారికి కూడ ఆదుకోవాల్సిన బాధ్యత సిఎఎ-2019 చట్టం చేసిన మోడీప్రభుత్వం పైనే ఉంటుందన్నారు. పొరుగు దేశాల మైనార్టీలు మత హింసకు గురి అయ్యి ఆయా దేశాల నుండి వలస వచ్చినప్పుడు వారికి పౌరసత్వం అందించడంను ఎవరు తప్పు పట్టరని, పొరుగు దేశాల ముస్లిమేతరులకు పౌరసత్వం అందించి ముస్లిములకు అందించకపోవడం ఎంతవరకు సబబన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తి విరుద్ధం : మహ్మద్ జహీద్



మోడీ ప్రభుత్వం అమలు చేయతలపెట్టిన సిఎఎ చట్టం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఫోరం ఫర్ డెమక్రసీ రాష్ట్ర కన్వీనర్ మహ్మద్ జహీద్ చెప్పారు. ప్రజల మధ్య అశాంతిని కలిగించడమే ఈ చట్టం ఉద్దేశమన్నారు. ఈ చట్టం మార్గదర్శకాలు చాలా అస్పష్టంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఇతర దేశాల నుంచి వచ్చిన ముస్లిమేతరులకు పౌరసత్వం ఇస్తామని ముస్లిములకు ఇవ్వబోమని చెప్పడం వెనుక మోడీ ప్రభుత్వానికి తెర వెనుక వేరే ఏజెండా ఉందన్నారు. ఎలక్టోరల్ బాండ్ల విషయంలో సుప్రీంకోర్టు మోడీ ప్రభుత్వాన్ని ప్రశ్నించడంతో ప్రజల దృష్టిని మళ్లించేందుకు హడావుడిగా సిఎఎను అమలును తెరపైకి తెచ్చారని అన్నారు. ఎస్‌బిఐ బాండ్ల విషయంలో దాటవేత వైఖరి ప్రదర్శించడాన్ని సుప్రీంకోర్టు మొట్టికాయలు వేయడాన్ని జీర్ణించుకోలేక మోడీ ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ప్రకటించిందన్నారు.

గీతాంజలికి నివాళిగా క్యాండిల్ ర్యాలీ

(మొదటి పేజీ తరువాయి)

అత్యంత బాధాకరమని, ఆమె మృతిపై సిఎం జగన్ స్పందించారని అన్నారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలున్న నేపథ్యంలో వారిని ఆదుకునే నిమిత్తం రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని అధికారులను సీఎం ఆదేశించారని చెప్పారు. బాలికలకు బ్యాంకు ఖాతా ప్రారంభించామని, ఆ ఖాతాలకు వైసిపి కార్యకర్తలు అంతా తమ వంతు బాధ్యతగా కనీసం రూ.5 చొప్పున చెల్లించి ఆదుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌ఛార్జి సజ్జల భార్గవరెడ్డి, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, పోతుల సునీత, కళ్యాణి, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఇన్‌ఛార్జి నూరి ఫాతిమ, మంగళగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మురుగుడు లావణ్య, ఎన్నారై అధికార ప్రతినిధి కడప రత్నాకరు పాల్గొన్నారు.

ఆడపిల్లను అదృష్టంగా భావించాలి

(మొదటి పేజీ తరువాయి)

సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి శివకుమారి అధ్యక్షత వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు ఆకాశమే హద్దుగా అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారని, సమాజంలో తమకంటూ ఓ ప్రత్యేక హోదాను గుర్తింపును కలిగేలా అడుగులు వేస్తున్నారని అన్నారు. జిల్లాల్లో పలు కీలక పదవుల్లో మహిళలే ఉన్నారని గుర్తు చేశారు. రాజకీయంగా పురుషులుకు ఏమాత్రం తీసిపోమని తమ ప్రతిభను నిరూపిస్తున్నారని చెప్పారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలంటే నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలని, అప్పుడే మహిళా సాధికారత సాగించగలుగుతారని చెప్పారు. ఉన్నతంగా ఎదిగిన మహిళల జీవిత చరిత్రలు చదవాలని సూచించారు. శివకుమారి మాట్లాడుతూ మహిళా రక్షణకు చట్టాలు మరింత పటిష్టంగా



సభకు హాజరైన మహిళలు

అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. హక్కుల సాధన కోసం ఏర్పడ్డ అంతర్జాతీయ మహిళా దినోత్సవం హక్కుల గురించి కాకుండా లక్ష్యాన్ని మరిచి రాష్ట్ర ప్రభుత్వం ఒక పండుగలా జరుపుతోందన్నారు. దేవేగౌడ ప్రధానిగా ఉన్న సమయంలో 33 శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పిస్తే ఆ బిల్లును బిజెపి, కాంగ్రెస్ నాడు వ్యతిరేకించాయన్నారు. తాజాగా బిజెపి ప్రభుత్వం తెచ్చిన 33 శాతం రిజర్వేషన్‌ను 2029లో అమలు చేస్తామని చెప్పటం మహిళా లోకాన్ని మోసం చేయడమే అన్నారు. నేటికీ మహిళలు పనిచేసే చోట లైంగిక వేధింపులకు గురవుతున్నారని, 1999లో బీజం పడిన లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2013లో అమలైనా సమర్ధవంతంగా పనిచేయడం లేదని అన్నారు. పల్నాడు జిల్లా జిసిడిఒ డి.రేవతి మాట్లాడుతూ విద్యతోనే మహిళల అభ్యున్నతి సాధ్యమన్నారు. తల్లిదండ్రులు ఆడపిల్లలను భారంగా భావించకుండా బాధ్యతాయుతంగా పెంచాలన్నారు. చదువే అన్ని సమస్యలకు పరిష్కారం మార్గం చూపుతుందని, ఆ దిశగా మహిళలు ముందుకు సాగాలని చెప్పారు. మహిళలు నేడు సాధిస్తున్న విజయాలను చూసి ఒకరి నుంచి ఒకరు స్ఫూర్తి పొందాలన్నారు. మహిళలు రాజకీయాల్లో కూడా వచ్చి ప్రజాసేవ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి పెద్దిరాజు మహిళలకు సమస్ఫూర్తినిచ్చేలా గేయాలు ఆలపించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి జి.రజిని, నాయకులు జి.ఉమశ్రీ, జి.మల్లీశ్వరి, యుటిఎఫ్ నాయకులు బాగేశ్వరిదేవి, వివిధ సంఘాల నాయకులు జి.మల్లీశ్వరి, కెపి. మెటిల్డాదేవి, ఆంజనేయ నాయక్, కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కార్యకర్తలపై దాడి హేయం : టిడిపి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : నరసరావుపేటలో ప్రజాస్వామ్యం కనుమరుగై పోతుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అరాచకాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని టిడిపి నరసరావుపేట ఇంచార్జ్ డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. మంగళవారం పట్టణంలో క్రిస్టియన్ పాలెం లో ఎన్నికల ప్రచారంలో భాగంగా డ పర్యటిస్తున్న టిడిపి కార్యకర్తలపై వైసీపీ శ్రేణులు రాళ్లతో దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు టిడిపి చేనులపై వైసీపీ శ్రేణులు దాటికి పాల్పడ్డారని దాడికి పాల్పడిన వారిపై పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి సామాన్యులకు చట్టం పట్ల నమ్మకం కలిగించాలన్నారు. వైసిపి కార్యకర్తల మూకుమ్మడి దాడిని ఖండిస్తూ డాక్టర్ చదలవాడ టిడిపి కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసి రోడ్ పై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ఓటమి భయంతో దాడులను ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. క్షతగాత్రులను పరామర్శించి అండగా ఉంటామన్నారు.



యుటిఎఫ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా యూటీఎఫ్ తెనాలి ప్రాంతీయ కార్యాలయంలో మహిళా సభ నిర్వహించారు. తెనాలి టౌన్ అధ్యక్షురాలు పి సౌజన్య అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్త్రీ పురుషుల సమానత్వం, అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రాముఖ్యతను ఆయన వివరించారు. అనంతరం మండలాలువారిగా దిగువ తరగతి మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఎఎన్ కుసుమ కుమారి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు బి ఆదిలక్ష్మి, సిఐటియు నాయకులు కొల్లిపర బాబు ప్రసాద్ లు పాల్గున్నారు.

బీసీల పట్ల వివక్ష

ప్రజాశక్తి-తాడేపల్లి

వైసిపి ప్రభుత్వం బీసీ జనగణన వివరాలను బహిర్గతం చేయకుండా తొక్కి పెట్టి బీసీల పట్ల వివక్షత చూపుతుందని ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు అంగిరేకుల వరప్రసాద్‌యాదవ్ అన్నారు. మంగళవారం సాయంత్రం తాడేపల్లి ప్రెస్‌క్లబ్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి పాలనలో బీసీలు ఆర్థికంగా సామాజికంగా అనకుదొక్కుబడ్డారని అన్నారు. ఓబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, యాదవ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ దానబోయిన సుందరరావు యాదవ్ మాట్లాడుతూ గుంటూరు పార్లమెంట్ పరిధిలో బీసీలు అందరూ సంఘటితంగా వ్యవహరించాలన్నారు. గుంటూరు పార్లమెంట్ టిడిపి పార్లమెంట్ అభ్యర్థి ఉన్నత విద్యావంతులు పెమ్మసాని చంద్రశేఖర్ విజయానికి కృషి చేయాలని అన్నారు. టిడిపితోనే బీసీలకు సామాజిక న్యాయం రాజకీయ సమానత్వం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంఘం న్యాయ సలహాదారులు తోట శివరాంప్రసాద్, మాజీ మండల అధ్యక్షులు చావలి ఉల్లయ్య, ఓబిసి సంక్షేమ సంఘం మంగళగిరి నియోజకవర్గ కో- కన్వీనర్ మద్రి ఏసుబాబు, ఎస్సీ ఎస్టీ ఓబీసీ స్టూడెంట్ ఫెడరేషన్ కన్వీనర్ దాసరి మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బోల్లవరంలో కన్నా ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-ముప్పాళ్ల : మండలంలోని బొల్లవరంలో టిడిపి సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కన్నా మంగళవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలు పంచి టిడిపి ఎన్నికల మేనిఫెస్టో గురించి చెప్పారు. మహాశక్తి పేరుతో తల్లికి వందనం పథకం ద్వారా రూ.15 వేలు రూపాయలు బిడ్డలను చదివించేందుకు ఇస్తామన్నారు. ఆడపడుచులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించనున్నారు. రైతులకు అండగా ఉండేందుకు ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సాయం చేస్తామని చెప్పారు. యువతకు 20 లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తామని, ఇంటింటికీ రక్షిత తాగునీటి కల్పిస్తామన్నారు. టిడిపి - జనసేన కూటమి ద్వారానే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బి.నాగేశ్వరరావు, నాయకులు బి.ఆదినారాయణ, ఎ.సాంబయ్య, ఎస్.వెంకటరావు, ఆర్.మధు, ఎస్.పవన్ కుమార్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

చంద్రబాబు ఇంటి వద్ద అసంతృప్తి సెగ

ప్రజాశక్తి-తాడేపల్లి : అనకాపల్లి జిల్లా యలమంచిలి నియోజకవర్గం నుండి చంద్రబాబును కలిసేందుకు టిడిడి ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరావు వర్గీయులు మంగళవారం తరలివచ్చారు. జనసేన అభ్యర్థికి సీటు కేటాయించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అమరావతి కరకట్టపై నిరసన తెలిపారు. టిడిపి అభ్యర్థికే మా మద్దతు అంటూ నినాదాలు చేశారు.

నీరిచ్చే ఓట్లడుగుతామేనే హామీ ఏమైంది : టిడిపి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు ప్రజలకు 70 ఏళ్ల కలగా ఉన్న వరికపూడిసెల నిర్మాణం టిడిపి ద్వారానే సాధ్యమవుతుందని ఆ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు జివి ఆంజనేయులు అన్నారు. మంగళవారం స్థానిక టిడిపి పార్లమెంట్ నియోజకవర్గ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు వరికపూడిసెల నిర్మాణానికి కొంత నిధులు కేటాయించినా వైసిపి అధికారంలోకి వచ్చాక పటించుకోలేదని అన్నారు. నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న అంబటి రాంబాబు కూడా వరికపూడిసెల ప్రాజెక్ట్‌ను విస్మరించారని అన్నారు. ప్రస్తుతం రాజకీయ లబ్ధి కోసం హడావిడిగా శంకుస్థాపనలు చేస్తున్నారని, ఒక్క ప్రొక్లైన్ తీసుకెళ్లి వైసిపి ఎమ్మెల్యేలు పెద్ద డ్రామా చేస్తున్నారని విమర్శించారు. పల్నాడు ఎమ్మెల్యేలు గత ఎన్నికల సమయంలో... అధికారంలోకి వచ్చిన 6 నెలల్లో ప్రాజెక్టు పూర్తి చేసి నీళ్లు ఇస్తామని లేదంటే తాము ఓట్లు అడగబోమని ఇచ్చిన హామీలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టుకు కేంద్రం నుండి అనుమతులు వచ్చేలా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు కృ చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో పల్నాడులోని అన్ని స్థానాల్లోనూ టిడిపి గెలుస్తుందని చెప్పారు. ఎంపీ లావు శ్రీకృదేవరాయలు మాట్లాడుతూ నాగార్జున సాగర్ కుడి కాల్వ పరిధిలో 40 శాతం పంటలు ఇప్పటికే ఎండిపోయాయని, ఎవరు వస్తే తమకు న్యాయం జరుగుతుంతోనని ప్రజలు ఆలోచిస్తున్నారని అన్నారు. వైసిపి ఎమ్మెల్యేలు చాలా మంది భయపడుతున్నారని, భయం వీడి , రాష్ట్రంలో పెండింగులో ఉన్న ప్రాజెక్టులు, రాజధాని అమరావతి గురించి నోరు విప్పాలని అన్నారు. వైసిపిలో ఉన్న 80 శాతం మందికి ఓటమి భయం పట్టుకుందన్నారు. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రం మొత్తం మీద వరికపూడిసెల ప్రాజెక్ట్‌కు ఎక్కువగా అనుమతులు



తెచ్చానని, ఏది జరిగినా ఒక్కడి వల్ల కాదని అన్నారు. టిడిపి నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందుబాబు మాట్లాడుతూ పల్నాడు ప్రజలను మరోసారి దగా చేసేందుకు వరికపూడిసెల పనులు ప్రారంభం అంటూ వైసిపి నాయకులు సిద్ధమయ్యారని అన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే వరికెపూడిసెల ప్రాజెక్టు పూర్తి చేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో టిడిపి డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, ఎస్టీ సెల్ రాష్త్ర అధ్యక్షులు ఎం.దారునాయక్, నాయకులు వెన్నా సాంబశివరెడ్డి, కె.లలిత్ సాగర్, కె.కిరణ్, ఆర్.జగ్గారావు, సిహెచ్.ఆంజనేయులు, కె.హనుమంతరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి

ప్రజాశక్తి - మాచర్ల : భైరవుని పాడు గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కేతావత్ సంకర నాయక్ (50) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయపురిసౌత్‌లో నివాసం ఉండే శంకర నాయక్ ద్విచక్ర వాహనంపై రోజు మాచర్ల వచ్చి సిమెంట్ బ్రిక్స్ తయారు చేసే కంపెనీలో పనిచేసి తిరిగి విజయపురి సౌత్ వెళుతుంటాడు. మంగళవారం కూడా పని ముగిసిన అనంతరం విజయపురి సౌత్ వెళుతుండగా మాచర్ల నుండి విజయపురి సౌత్ కి వెళ్తున్న కారు వెనక నుండి ఢీకొనడంతో బండి పై నుండి పడి సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. శంకర్ నాయక్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

సీట్ల కేటాయింపులో పునరాలోచించాలి

ప్రజాశక్తి మంగళగిరి :సార్వత్రిక ఎన్నికలలో పోటీ చేసేందుకు జనసేన పార్టీకి సీట్ల కేటాయింపు విషయంలో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పునరాలోచించాలని జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ నాయకులు తిరుమల శెట్టి కొండల రావు అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో టిడిపి జనసేన బిజెపి ఉమ్మడి కూటమితో బరిలోకి దిగనుండటం అభినంది ంచదగ్గ విషయ మని అన్నారు. బిజెపి, జనసేన పార్టీలకు చాలా తక్కువ సీట్లు కేటాయించినట్లు అనిపిస్తోందని తెలిపారు. దీని వలన జనసేన పార్టీ ఓట్లు పార్టీ అధ్యక్షుడు సామాజిక వర్గం ఓట్లు బదిలీ అయ్యే అవకాశం లేదని తెలిపారు. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని చంద్రబాబు నాయుడు అదనంగా 3 ఎంపీ స్థానాలను మరో 10 అసెంబ్లీ స్థానా లను జనసేన పార్టీకి కేటాయించాలని కోరారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు నాయుడు తన రాజకీయ అనుభవంతో ఆలోచించి సమయ స్ఫూర్తితో వ్యవహరించి తగు విధంగా ఆలోచన చేయాలని కోరుతున్నట్లు చెప్పారు.

కావటికి టిక్కెట్టు ఇస్తే ఓడిస్తా

వైసిపి నేత మల్లెల రాజేష్ నాయుడు

మంత్రి రజిని సీటు ఇప్పిస్తానని రూ.కోట్లు తీసుకున్నారని ఆరోపణ

మర్రి రాజశేఖర్‌కి టిక్కెట్టు ఇస్తే రూ.20కోట్లు ఖర్చు పెట్టి గెలిపిస్తా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో వైసిపి నుంచిపోటీ చేస్తున్న మంత్రి విడదల రజనీ వైసిపి సీటు ఇప్పించినందుకు తన వద్ద రూ. 6.5 కోట్లు మంత్రి రజనీ లంచంగా తీసుకున్నారని ఆ పార్టీ చిలకలూరిపేట అభ్యర్థి మల్లెల రాజేష్ నాయుడు ఆరోపణ చేశారు. మంగళవారం చిలకలూరిపేటలో వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో మాట్లాడుతూ చిలకలూరిపేట ఎమ్మెల్యేగా ఉన్న రజనీ తాను గుంటూరు వెళ్తున్నానని ఈ సీటు నీకు ఇప్పిస్తానని తన వద్ద రూ.6.5 కోట్లు తీసుకున్నారని చెప్పారు. ఈ విషయం తాను ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకువెళ్లానని రూ.3 కోట్లు వెనక్కి ఇచ్చారని మిగతా డబ్బు ఇవ్వడం లేదన్నారు. సజ్జలను మళ్లీ అడిగితే వదిలేయవయ్యా అని తప్పించుకుంటున్నారని తెలిపారు. ఇప్పుడు తనకు సీటు లేకుండా గుంటూరు మేయర్ కావటి మనోహర్ నాయుడికి అవకాశం ఇవ్వాలని చూస్తున్నారని చెప్పారు. తనకు టిక్కెట్ ఇవ్వకపోతే ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌కు సీటు ఇవ్వాలన్నారు. రాజశేఖర్‌కు రూ.20 కోట్లు తాను ఖర్చు చేసి గెలిపిస్తానని తెలిపారు. ఒక వేళ కావటి మనోహర్ నాయుడికి టిక్కెట్ ఇస్తే ఓడిస్తానని తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించడం లేదని ఇష్టానుసారంగా సమన్వయకర్తలను మారుస్తున్నారని ధ్వజమెత్తారు.

పేట సమన్వయకర్తగా కావటి!

మల్లెల రాజేష్‌నాయుడు తొలగింపు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

చిలకలూరిపేట వైసిపి సమన్వయకర్తగా గుంటూరు మేయర్ కావటి మనోహర్ నాయుడు నియమితులయ్యారు. ఈమేరకు మంగళవారం రాత్రి వైసిపి కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఇప్పటి వరకు సమన్వయకర్తగా ఉన్న మల్లెల రాజేష్‌నాయుడ్ని తప్పించారు. ఆయన పార్టీ అధిష్టానం మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేయడం లేదన్న భావనతో తప్పించినట్లు తెలిసింది. అయితే మల్లెల రాజేష్ నాయుడు మంగళవారం చిలకలూరిపేటలో మాట్లాడుతూ తననుకాదని మనోహర్ నాయుడ్ని ఎంపిక చేస్తే ఓడిస్తానని ప్రకటించారు. రాజేష్ నాయుడి గత మూడునెలలుగా చిలకలూరిపేటలో చురుగ్గా పనిచేస్తున్నా ఆర్థిక సంబంధ వ్యవహారాల్లో అధిష్టానం ఆశించిన విధంగా ఖర్చు చేయడంలేదని భావించి మార్పు చేసినట్టు గత కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత చిలకలూరిపేట ఎమ్మెల్యే,మంత్రి రజనీకి వ్యతిరేకంగా కూడా ఆయన పలు ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలు చేసిన కొద్దిసేపటికే కావటి మనోహర్‌ను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. చిలకలూరిపేట ఎమ్మెల్యే రజనీని గుంటూరుకు మార్చడం,గుంటూరు మేయర్ కావటి మనోహర్ నాయుడును చిలకలూరిపేట అభ్యర్థిగా ఎంపిక చేయడంపై రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. స్థానికంగా అవకాశం ఉన్నా స్థానికేతరులుగా అక్కడ వారు ఇక్కడ, ఇక్కడ వారు అక్కడ పోటీ చేయడం ఈ సారి ఎన్నికల్లో విచిత్రంగా ఉందనే వాదనలు విన్పిస్తున్నాయి. గుంటూరు మేయర్ కావటి మనోహర్ నాయుడ్ని ఎంపిక చేయడం ద్వారా చురుగ్గా పనిచేస్తారని పార్టీ అధిష్టానం భావించినట్టు జిల్లాకు చెందని సీనియర్ నాయకుడొకరు తెలిపారు.

గీతాంజలి ఘటనలో ఎవ్వరినీ వదిలిపెట్టం

జిల్లా ఎస్‌పి తుషార్‌దూడి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తెనాలిలో ఆత్మహత్య చేసుకున్న వివాహిత గీతాంజలి వ్యవహారంలో అన్నికోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని జిల్లా ఎస్‌పి తుషార్ దూడి తెలిపారు. గుంటూరులోని తన కార్యాలయంలో మంగళవారం రాత్రి 9.30గంటలకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గీతాంజలి ఈనెల 7న ఆత్మహత్యయత్నం చేసిందన్నారు. వెంటనే రైల్వేపోలీసులు గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారని తెలిపారు. రైల్వే పోలీసుల దర్యాప్తులో ఆమె సోషల్ మీడియాలో పోస్టింగ్స్‌కు మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడినట్టు నిర్ధారణ అయిందన్నారు. ఈమేరకు రైల్వే పోలీసులు తెనాలి వన్‌టౌన్‌కు కేసును బదిలీ చేయగావెంటనే 306 సెక్షన్ కింద కేసు నమోదు చేశామన్నారు. డిజిటల్ పుట్ ప్రింట్స్, సోషల్ మీడియా హ్యాండిల్స్ చెక్ చేస్తున్నామన్నారు. కొన్ని ఫేక్ ఐడిలు, కొన్ని ఒరిజినల్ ఐడిలు ఉన్నట్లు గుర్తించామన్నారు. అసభ్యకర పోస్టింగ్స్ పెట్టిన వారిని గుర్తిస్తామని ఎవరిని వదిలి పెట్టేది లేదన్నారు. గీతాంజలి కొన్ని మీడియా ఛానెల్‌లకు ఇచ్చిన ఇంటర్వ్యూ, సోషల్ మీడియాలో వైరల్‌గా మారినందున, కొందరు ఆకతాయిలు తనని, తన కుటుంబాన్ని అసభ్య పదజాలంతో ట్రోల్ చేయడంతో ఆమె మనస్తాపానికి గురయిందన్నారు. ఆనందంతో ఉద్వేగానికి లోనై మాట్లాడిన ఓ ఇంటర్వ్యూ వీడియో పోస్ట్ చేయడం ఆమె బలవన్మరణానికి కారణంగా మారడం దురదష్టకరం అన్నారు. ఈ కేసులో నేరస్థులకు చట్ట రీత్యా తగిన శిక్షను విధిస్తామన్నారు. గీతాంజలి కేసులో సోషల్ మీడియాలో ట్రోలర్లు వాడిన భాషను మీడియా ముందుంచలేని పరిస్థితి ఉందన్నారు. నిందితులపై తగిన చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు.



పెనుమాకలో చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-తాడేపల్లి

రాజధాని ముఖద్వారమైన పెనుమాకలో బాషా టెంట్ హౌస్ అధినేత బాష ఆధర్యంలో మంగళవారం మంచినీటి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలిరోజు మజ్జిగ పం పిణీ చేశారు. రాను న్న ఎండా కాలం నేప థ్యంలో ప్రజల దాహా ర్తిని తీర్చే ందుకు మంచి నీటి చలివేంద్రం ఏర్పాటు చేసిన బాషాకు పలువురు అభినందనలు తెలిపారు.



హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే తదితరులు

అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-తెనాలి

పురపాలక సంఘ పరిధిలోని ఒకటోవార్డు ఐతానగర్‌లో నూతనంగా నిర్మించిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మంగళవారం ప్రారంభి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆరోగ్య సంరక్షణే పరమావధిగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ఒక వరమతై, దానికి తోడు పట్టణంలో ఆరు అర్బన్ హెల్త్‌సెంటర్లు ఉన్న సంగతి తెలిసిందే. అలాగే అర్బన్ ప్రాంతంలో ప్రైమరీ హెల్త్ సెంటర్‌తో ఆరోగ్య సేవలు ప్రజలకు మరింత చేరువచేసినట్లేనన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బి.శేషన్న, వైస్‌చైర్మన్లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి పాల్గొన్నారు.



ఫర్నిచర్ బహూకరణలో మానవత స్వచ్ఛంద సంస్థ బృందం

జిల్లా గ్రంథాలయానికి ఫర్నిచర్ బహూకరణ

ప్రజాశక్తి తెనాలి:స్థానిక జిల్లా గ్రంథాలయానికి పట్టణానికి చెందిన మానవత స్వచ్ఛంద సంస్థ ఫర్నిచర్ బహూకరించింది. సంస్థ చైర్మన్, ఎఎస్‌ఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె రామ్ చంద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రంథాలయానికి రూ.55వేల విలువైన 21 కుర్చీలు, రెండు బెంచీలు, నాలుగు ఫ్యాన్లు వితరణ చేశారు. కార్యక్రమంలో సంస్థ కో చైర్మన్ డాక్టర్ డి శారద, డి వి ఎల్ సోమయ్య శాస్త్రి, సభ్యులు పాల్గొన్నారు

విఆర్‌ఒ వింత పోకడ

ప్రజాశక్తి-తాడేపల్లి :తాడేపల్లి పట్టణంలోని 13వ వార్డు విఆర్‌ఒ వింత పోకడ పట్టణంలో చర్చనీయాంశమైంది. పేదలు కూలి నాలి చేసి సంపాదించిన డబ్బులో ఇల్లు కట్టుకుందామని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సందర్భంలో విఆర్‌ఒ రంగ ప్రవేశం చేసి డబ్బులు డిమాండ్ చేయడం వారిని కుంగదీసింది. అంత డబ్బు తాము ఇవ్వలేమని చెప్పినా నిర్మాణం నిలిపివేయాలని హెచ్చరించాడు. దీంతో కాళ్లవేళ్ల పడి కొంత మొత్తం చెల్లిస్తామని చెప్పినా వినకపోవడంతో గిరిజన కుటుంబం ఆందో ళన చెందింది. దీంతో సదరు విఆర్‌ఒ ఆ కుటుంబంపై తిట్ల వర్షం కురిపిస్తూ ఇంటి కోసం నిర్మించిన ఒక్కో పిల్లర్‌కు రూ.5 వేలు డబ్బులు ఇవ్వాల్సిం దేనని, లేకుంటే కట్టిన నిర్మాణాన్ని కూల్చి వేస్తామని హెచ్చరిం చాడు. ఉన్నతాధి కారులను కలవ డానికి ఆ కుటుంబం సిద్ధమైంది.

పలు నిర్మాణాలకు శంకుస్థాపన

ప్రజాశక్తి - మంగళగిరి :వివిధ కులాల వారికి అనువుగా పలు కమ్యూనిటీ హాల్స్‌కు మంగళవారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి శంకుస్థాపన చేశారు. అందరికీ సామాజిక న్యాయం అందిం చాలని ఉద్దేశంతో ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలన కొన సాగు తుందని అన్నారు. దానిలో భాగంగానే పేదలుగా ఉన్న కొన్ని కులాల వారికి కమ్యూనిటీ హాల్స్ ఉపయోగపడే విధంగా ఉండేందుకు నిధులు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయడం జరిగింది అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, మురుగుడు లావణ్య, వివిధ శాఖల చెందిన అధికారులు పాల్గొన్నారు.

మామిడి పూతకు తెగుళ్ల వాత

- రాలిపోతున్న పూత, పిందె - ఆందోళనలో రైతులు
- దిగుబడి తగ్గి మరింత ప్రియం కానున్న ధరలు




చెట్టుకు ఒక మోస్తరుగా ఉన్న మామిడి పిందెలు.. తెగులు సోకిన నాదెండ్ల మండలం కనపర్తి గ్రామంలో మామిడి తోట

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మామిడి చెట్లకు ఈ ఏడాది పూత బాగా వచ్చిందని రైతులు సంతోషం ఎంతో కాలం నిలవలేదు. చెట్లకు పేను బంక తెగులు సోకడంతో పూత పిందె రాలిపోతున్నాయి. పల్నాడు జిల్లాలో 700 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో మామిడి తోటలు సాగవుతున్నాయి. నరసరావుపేట, రాజుపాలెం, క్రోసూరు మండలాల్లో అత్యధికంగా సాగవుతోంది. గతేడాదితో పోలిస్తే పూత ఆశాజనకంగా ఉండడంతో ఈ ఏడాది దిగుబడిపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. అయితే వారి ఆశలను పేను బంక, బూడిద తెగుళ్లు నాశనం చేస్తున్నాయి. తెగుళ్ల కారణంగా పూతతో పాటు, మామిడి పిందెలు రాలిపోతున్నాయని, నష్టం రూ.లక్షల్లో ఉంటుందని రైతులు వాపోతున్నారు. కనీసం పెట్టుబడులైనా వచ్చేలా లేవంటున్నారు.

సాధారణంగా మంచు తీవ్రతకు వచ్చే బూడిద తెగులు వాతావరణంలో సంభవించిన మార్పుల నేపథ్యంలోనే ఈ ఏడాది మంచు తీవ్రత ఒక మోస్తరుగా ఉన్నా ప్రభావం మాత్రం తీవ్రంగా ఉంది. 6.5 ఎకరాల్లో సాగు చేస్తున్న తోటకు వ్యాపారులు రూ.4 లక్షలకు పైగా ధర చెల్లించి పంటను విక్రయించుకునేవారు. ప్రస్తుతం పూత పిందెలు రాలిపోతుండడంతో తోట కొనుగోలుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. ఈ నేపథ్యంలో మామిడి పండ్ల ధరలు మరింత ప్రియం అయ్యే అవకాశం ఉంది. గతేడాది కిలో మామిడి పండ్లు నాణ్యతను బట్టి రూ.60-80 వరకు ఉండగా ఈసారి రూ.100 పైగా పెరగవచ్చని అంచనా. వినియోగదార్లకు ఇది చేదయ్యేలా కనిపిస్తోంది. మరోవైపు నష్టాల బారిన పడుతున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

నష్టాలు తప్పేలా లేవు

తోకల కోటేశ్వరరావు, కౌలురైతు, పెద్దరెడ్డిపాలెం, నరసరావుపేట మండలం



నాదెండ్ల మండలం కనపర్తిలో 1.60 ఎకరాల్లో మామిడి తోటను రూ.50 వేలకు కౌలుకు తీసుకుని నాలుగేళ్లుగా సాగు చేస్తున్నాను. మొదటి రెండేళ్లు పెట్టుబడులు పోను కొంత లాభం వచ్చింది. గతేడాది బొబ్బర తెగులు సోకడంతో పెట్టుబడుల వరకే రాబట్టుకోగలిగాం. ఈ ఏడాది పూత మొత్తం రాలి పోయింది. పేను బంక నివారణ కోసం రసాయనిక పురుగు మందులకు రూ.12 వేలు, పశువుల ఎరువుకు రూ.7 వేలు ఖర్చు చేసినా నష్టాలు తప్పేలా లేవు.



పేను బంక సోకిన మామిడి చెట్టు

ఇలా చేయండి..

సిహెచ్. వెంకట రమణరెడ్డి, ఉద్యాన శాఖాధికారి, పల్నాడు జిల్లా.



రైతులు నేరుగా పురుగు మందుల దుకాణాల వారిని సంప్రదించకుండా ఉద్యాన శాఖాధికారుల సూచనలు మేరకు యాజమాన్య చర్యలు చేపట్టడం మంచిది. పురుగు, తెగుళ్ల మందులతో పాటు పూత దశలో తరచూ బోరాన్ పిచికారీ చేయడం ద్వారా తోట మెత్తగా ఉండడం, ఆడ పూతలు ఎక్కువగా వచ్చి దిగుబడి పెరుగుతుంది. పేనుబంక నివారణకు మోనోక్రోటోఫాస్ 2 మిల్లీ లీటర్లు, కార్బెండిజం ఒక గ్రాము, స్టిక్కింగ్ ఏజెంట్ 0.5 మిల్లీ లీటర్లను ఒక లీటరు నీటికి కలిపి చెట్టు మొత్తం బాగా తడిసేలా పిచికారీ చేయాలి. 10 నుండి 15 రోజుల అనంతరం బుప్రొఫిజిన్ 1.5 మిల్లీ లీటరు, థయోఫినెట్ మిథైల్ 1 గ్రాము, ప్లానోఫిక్స్ 20 మిల్లీలీటరును లీటరు నీటికి చొప్పున పిచికారీ చేయాలి. 3వ సారి బుప్రోఫెజిన్, ఎసిఫేట్ 1 గ్రాము లేదా డైనెటోఫ్యూరాన్ 20 గ్రాములు, సాఫ్ 2 గ్రాములు, ప్లానోఫిక్స్ 0.2 విల్లీలీటర్లు లీటరు నీరు చొప్పున పిచికారీ చేయాలి. బూడిద తెగులు నివారణకు హెక్సాకోనాజోల్ 2 మిల్లీ లీటర్లను లీటరు నీటితో పిచికారీ చేయాలి.



సభకు ముందు కోలాట ప్రదర్శన మహిళల

అప్పటి పోరాటాలే.. ఇప్పటి హక్కులు..

ప్రజాశక్తి-సత్తెనపల్లి

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పట్టణంలోని కొత్తపేటలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో నిర్వహించారు. సభకు ఐద్వా పట్టణ ఉపాధ్యక్షులు డి.విమల అధ్యక్షత వహించగా కార్యదర్శి గద్దె ఉమశ్రీ మాట్లాడుతూ మహిళల హక్కుల కోసం అనేక రూపాల్లో పోరాటాలు చేయడం వల్లే నేడు మహిళలకు కొంతైనా స్వేచ్ఛ, సమానత్వం, ఇతర హక్కులు దక్కాయని అన్నారు. మద్యం వల్ల అనేక కుటుంబాలు నాశనమవుతున్నాయని, మహిళలు అత్యాచారాలు, ఇతర దాడులకు గుర్వుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు రక్షణ లేకుండా పోతోందన్నారు. మహిళలకు విద్య కోసం సావిత్రీబాయి పూలే ఎన్నో కష్టనష్టాల కోర్చి విద్యాసంస్థను నడిపారని, దాడులకు గురైనా బెదరకుండా స్త్రీ విద్య వ్యాప్తికి, బాల్య వివాహాల నిషేధం, వితంతు పునర్వివాహాల కోసం పాటుపడ్డారని గుర్తు చేశారు. సావిత్రీబాయి పూలే స్ఫూర్తితో మహిళల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. తొలుత ఐద్వా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంఘం జెండాను ఆవిష్కరించగా స్థానిక మహిళలు కోలాట ప్రదర్శన చేశారు. పిల్లలకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఐద్వా పట్టణ ఆధ్యక్షులు ఎం.జ్యోతి, సిఐటియు నాయకులు సుజాత, ధనలక్ష్మి, చాముండేశ్వరి, మౌలాబీ, పద్మ, నజ్మ, సీత, టి.హైమావతి, సుధారణి, సునీత, కృష్ణవేణి, పవన్ పాల్గొన్నారు.

జగన్ పాలన అంతానికి చిలకలూరిపేట ఉమ్మడి సభ నాంది : పుల్లారావు


ప్రజాశక్తి - చిలకలూరిపేట



చిలకలూరిపేటలో ఈనెల 17న నిర్వహించే సభ రాష్ట్రంలో జగన్ పాలనకు అంతానికి నాంది అవుతుందని మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని తన నివాసంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడిగా నిర్వహించే సభకు ఏర్పాటకు సంబంధించి బుధవారం ఉదయం 9.32 గంటలకు శంకుస్థాపన చేస్తామన్నారు. 17న సభకు ప్రధాని నరేంద్ర మోడీ, టిడిపి, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ పాల్గొంటారని, ఈ సభలోనే ఉమ్మడి మేనిఫెస్టో ప్రకటన ఉంటుందని చెప్పారు. సభ నిర్వహణకు 125 ఎకరాలను గుర్తించామని, అన్ని ప్రాంతాలకు చెందిన మూడు పార్టీల ముఖ్య నేతలతో 13 కమిటీలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కమిటీలకు నారా లోకేశ్ దిశానిర్దేశం చేస్తారన్నారు. ఆహార, తాగునీరు, వసతి సదుపాయాల బాధ్యతలు తనకు అప్పగిస్తారన్నారు. జగన్ నిర్వహిస్తున్న సభలకు జనం రావడం లేదని, గ్రీన్ మ్యాట్ ద్వారా లేని జనాన్ని చూపుతున్నారని అన్నారు. చరిత్ర ఉన్నంత కాలం జగన్ ఒక విఫల సిఎంగా మిగిలిపోతారని ఎద్దేవ చేశారు. క్రిమినల్ రికార్డ్ ఉన్నంత వరకూ జగన్ పేరు చంచల్‌గూడ జైలు గోడలపై ఉంటుందన్నారు. జగన్‌కు ప్రచార పిచ్చి పట్టుకుందని, మరుగుదొడ్ల తలుపుల పైనా పోస్టర్లు పెట్టుకున్నారని ఎద్దేవ చేశారు.

బిజెపి పాలనలో లక్షన్నర మంది రైతుల ఆత్మహత్య

14న ఢిల్లీలో భారీ సభ - మద్దతుగా జిల్లా, మండల కేంద్రాల్లో ఆందోళనలు




పిడుగురాళ్ల, మాదలలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు, రైతులు, కార్మికులు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల, ముప్పాళ్ల

కేంద్ర ప్రభుత్వ అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక దేశవ్యాప్త పిలుపు మేరకు 14న ఢిల్లీలోలోని రామ్‌లీలా మైదానంలో జరిగే భారీ బహిరంగ సభకు మద్దతుగా అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో జరిగే ర్యాలీలో అన్ని రంగాల ప్రజలు భాగస్వామ్యం కావాలని రైతుసంఘం పల్నాడు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏపూరి గోపాలరావు, జి.బాలకృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు కరపత్రాలను పిడుగురాళ్ల పట్టణంలోని గుంటూరు బస్టాండ్ సెంటర్లో, ముప్పాళ్ల మండలం మాదలలో రైతులు, కార్మికులతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఢిల్లీలో రైతు ఉద్యమం సందర్భంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు పరచకుండా రైతులను మోసం చేస్తోందని, మరోవైపు నల్ల వ్యవసాయ చట్టాలనే అమలు చేయబూనుకుంటోందని విమర్శించారు. దేశ సంపదను, పరిశ్రమలను కార్పొరేట్లకు కట్టబెడుతూ ప్రశ్నించిన వారిపై కేసులు బనాయిస్తూ వేధిస్తోందని మండిపడ్డారు. రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందన్నారు. హామీలను అమలు చేయాలని ఢిల్లీ సరిహద్దులకు వచ్చిన రైతులపై తీవ్రమైన నిర్బంధాన్ని ప్రయోగించటం దారుణమన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన పదేళ్లలో అనుసరిస్తున్న వ్యవసాయక విధానాల వల్ల దేశవ్యాప్తంగా లక్షన్నర మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వెలిబుచ్చారు. బిజెపి రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత 26 శాతం ఆత్మహత్యలు పెరిగాయన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధరల చట్టం చేయాలని, రైతు రుణ ఉపశమన చట్టం చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ఉపాధి హామీ చట్టాన్ని పటిష్ఠంగా అమలు పరచాలని, వ్యవసాయ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్ల బిగింపును ఆపాలని, ప్రభుత్వ రంగాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో పాలక, ప్రతిపక్ష పార్టీలు కేంద్రంలోని బిజెపికి ఊడిగం చేస్తూ రాష్ట్ర ప్రయోజనాలను గాలికి వదిలేస్తున్నాయని విమర్శించారు. ఈ పార్టీలకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. సిఐటియు పిడుగురాళ్ల మండల కార్యదర్శి టి.శ్రీను మాట్లాడుతూ కార్మికవర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను తెచ్చిందని, దీనికి వ్యతిరేకంగా రైతులతో కలిసి కార్మికవర్గం పెద్దఎత్తున పోరాడాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమాల్లో రైతుసంఘం పిడుగురాళ్ల మండల అధ్యక్ష కార్యదర్శులు జి.కోటేశ్వరరావు, బి.నాగేశ్వరరావు, నాయకులు ఎం.నరసింహారావు, కాటమరాజు, హనుమంతు నాయక్, వెంకటేశ్వర్లు, సిఐటియు నాయకులు బి.వెంకటేశ్వర్లు, వై.శ్రీను, బి.వెంకటేశ్వర్లు, ఎ.శ్రీను, ముప్పాళ్ల మండల నాయకులు జి.జాలయ్య, ఎం.వెంకటరెడ్డి, కె.సాంబశివరావు, పి.సైదాఖాన్, కె.నాగేశ్వరరావు, ఐ.సత్యనారాయణరెడ్డి, జి.రామారావు, సిహెచ్.నాగమల్లేశ్వరరావు, టి.వెంకటేశ్వర్లు, డి.చిన్నారావు పాల్గొన్నారు

పొదుపు, పరపతి సహకార సంఘం రిజిస్ట్రేషన్ పూర్తి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ట్రైని కలెక్టర్ కల్పశ్రీ ఆధ్వర్యంలో పొదుపు, పరపతి సహకార సంఘం రిజిస్ట్రేషన్ చేశారు. ఈ సంఘానికి అడ్‌హాక్ కమిటీని జిల్లా కలెక్టర్ నియమించారు. చీఫ్ ప్రమోటర్‌గా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు బి.బాలు నాయక్, కార్యవర్గ సభ్యులుగా డిఆర్ఓ కె.వినాయకం, ఎపిఎంఐపి పథక సంచాలకులు ఆంజనేయులు, రోడ్లు - భవనాల శాఖ జిల్లా అధికారి రాజానాయక్, పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చెర్మన్ గజ్జల శ్రీనివాసరెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఇ సుబ్బారాయుడు, మార్కెటింగ్ శాఖ ఎడిఎ సూర్యప్రకాష్‌రెడ్డి నియమితులయ్యారు.

సెక్టోరల్ అధికారులకు శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు


మాట్లాడుతున్న కమిషనర్

సెక్టోరల్ అధికారులు ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్ఓ కీర్తి చేకూరి అన్నారు. సాధారణ ఎన్నికల విధులపై సెక్టోరల్, రూట్ అధికారులకు అదనపు కమిషనర్ పశ్చిమ నియోజకవర్గ ఈఆర్ఓ కె.రాజ్యలక్ష్మీతో కలిసి మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 22 మంది సెక్టోరల్, 22 మంది రూట్ అధికారులకు విధులు కేటాయించామన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చిన నాటి నుండి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులోకి వస్తుందన్నారు. సెక్టోరల్ అధికారులు ముందుగా తమకు కేటాయించిన ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలను రూట్‌మ్యాప్ ప్రకారం పరిశీలించాలన్నారు. సెక్టోరల్ అధికారులు ముందుగా ఎన్నికల సంఘం నిబంధనలు, మార్గాదర్శకాలతో కూడిన హ్యాండ్ బుక్‌ని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు. కంట్రోల్ రూమ్, మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై తగు ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈఆర్‌ఓలు ప్రదీప్ కుమార్, సునీల్, ఎస్.ఈ. సుందర్రామిరెడ్డి, మేనేజర్ శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలతో కమిషనర్ సమావేశం...

గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో సాదారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాజకీయ పార్టీల నుండి అందిన ఫిర్యాదులు, ఆర్జీలను వెంటనే పరిష్కారం చేయాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్ఓ కీర్తి చేకూరి తెలిపారు. మంగళవారం కమిషనర్ చాంబర్‌లో ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితాపై అందిన ఆర్జీల పరిష్కారంపై పశ్చిమ నియోజకవర్గ ఈఆర్ఓ, అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మీతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈనెల 4 నుండి 10వ తేదీ వరకు ఫారం 6, 7, 8లు, షిఫ్టింగ్ దరఖాస్తులు 2,339 అందాయని వాటిని 2 రోజుల్లో పరిష్కారం చేయడానికి ఆదేశాలు జారీ చేశామన్నారు. సమావేశంలో ఏఈఆర్‌ఓలు ప్రదీప్ కుమార్, సునీల్, సూపరిండెంట్లు సాంబశివరావు, పద్మ, వివిద పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వడ్డీ రాయితీతో పన్ను చెల్లింపునకు నెలాఖరు వరకే గడువు

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ప్రభుత్వం ఏక మొత్తంగా ఆస్తి, ఖాళీ స్థల పన్నులు చెల్లిస్తే, వాటి పై ఉన్న వడ్డీని మాఫీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని, నెలాఖరు వరకే గడువు ఉందని నగర కమీషనర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటన ద్వారా తెలియచేశారు.కావున పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముందే పన్ను చెల్లించాలని, నెలాఖరులో సర్వర్ సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. జిఎంసి ప్రధాన కార్యాలయంతోపాటు, సర్కిల్ కార్యాలయాల్లోని క్యాష్ కౌంటర్లతో పాటుగా, భారత్‌పేటలోని 140, పెద్దపలకలూరు రోడ్డులోని 106, వసంతరాయపురం మెయిన్ రోడ్డులోని 148 వార్డు సచివాలయాల్లో కూడా క్యాష్ కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు.

కొనసాగుతున్న పసుపు రైతుల దీక్షలు

ప్రజాశక్తి - దుగ్గిరాల


కోల్డ్ స్టోరేజ్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు


దీక్షల్లో పాల్గొన్న రైతులు

తమకు నష్టపరిహారం అందేంతవరకు దీక్షలు కొనసాగిస్తామని రైతులు స్పష్టం చేశారు. శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ బాధితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 12 రోజుకి చేరాయి. బెల్లంపూడి గ్రామానికి చెందిన రైతు వెంకటప్ప రెడ్డి దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నష్టపరిహారం అందే వరకు దీక్షలు విరమించబోమని తెలిపారు. శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో నష్టపోయిన పసుపు రైతుల కమిటీ సభ్యులతో పాటు రైతులు సాయంత్రం కోల్డ్ స్టోరేజ్ యజమాని శ్యామ్ మహేశ్వరితో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ రైతుల వలన మీరు పెరిగారు కానీ, రైతుల పంటకు రూ.ఎనిమిది లక్షలు బీమా ఎందుకు చేయించలేకపోయారు అని యజమానిని నిలదీశారు. కేవలం రెండు లక్షల రూపాయలతో బీమా చేయించడం వలన ఈ రోజుల్లో రైతులు నష్టపోయిన పరిస్థితి ఏర్పడిందని ఎనిమిది లక్షలతో బీమా చేయించి ఉంటే రైతులు పూర్తిస్థాయిలో లాభం పొందే వారిని తెలిపారు. ఎవరైనా రైతు ఆత్మహత్యకు పాల్పడితే మీరే బాధ్యత వహించవలసి ఉంటుందని హెచ్చరించారు. చాలాసేపటి వరకు చర్చలు జరిగాయి. కానీ యజమాని నుండి ఎటువంటి స్పందన లేకపోవడంతో రైతులు కోల్డ్ స్టోరేజ్ ఆవరణలో కూర్చొని నిరసనలు తెలిపారు. కార్యక్రమంలో పసుపు రైతు రాష్ట్ర కమిటీ సభ్యులు జొన్న శివశంకర్, నష్టపోయిన రైతు కమిటీ కన్వీనర్ బి వెంకట రామయ్య, కో కన్వీనర్ ఎం శివ సాంబిరెడ్డి, కళ్లెం రాజశేఖర్ రెడ్డి, బాలరాజు, ఎన్ యోగేశ్వరరావు, వై బ్రహ్మేశ్వరావు, సిహెచ్ పోతురాజు, బి అమ్మిరెడ్డి, రైతులు జి శ్రీహరి, ఉమ్మారెడ్డి సుజాత, ఎల్ భాస్కర్ రెడ్డి, కే వెంకటేశ్వరరావు, నాదెండ్ల సురేంద్ర, నాదెండ్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - ఫిరంగిపురం రూరల్

పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ కార్యాయలయం వద్ద వారు చేస్తున్న సమ్మె మంగళవారం రెండవ రోజుకు చేరింది. ఏపీ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నాయకులు మాట్లాడుతు హరిత రాయబారులకు ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు తక్షణం ఇవ్వాలని, నెల నెలా జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు షేక్ మస్తాన్ వలి, మండల అధ్యక్ష, కార్యదర్శులు చందోల్ రామారావు, ఇబ్రహీం, ప్రభుదాస్, కోటేశ్వరమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.



ఇప్పటంలో జ్వరాలపై ఇంటింటి సర్వే

ప్రజాశక్తి, తాడేపల్లి రూరల్

ఎం టి ఎం సీ పరిధిలోని ఇప్పటం గ్రామంలో జిల్లా వైద్య శాఖ అధికారిని డాక్టర్ కే విజయలక్ష్మి, పెదవడ్లపూడి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్, గ్రామ సచివాలయాన్ని మంగళవారం సందర్శించారు. గత పది రోజులకు పైబడి, కాళ్ళ వాపులు, చేతి నొప్పులు, కొద్దిపాటి జ్వర లక్షణాలతో బాధపడుతున్న బాధితులను పరామర్శించారు. అనంతరం వైద్య అధికారుల అప్రమత్తమై గ్రామంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లతో, ఇంటింటికి ఫీవర్ సర్వేను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి సబ్ యూనిట్ ఆఫీసర్ ఎం శ్రీమన్నారాయణ, పెదవడ్లపూడి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం రమేష్, డాక్టర్ ఏ సతీష్, ఎంపీహెచ్వో, సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అనురాధ

సంజీవయ్య నగర్‌లో మహిళా దినోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక సంజీవయ్య నగర్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. సమావేశంలో సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కిలారు అనురాధ మాట్లాడుతూ సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలకు చట్ట సభల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించటంలో ప్రభుత్వాలు విఫలం అయ్యాయన్నారు. ఇప్పటికీ అనేక రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలకు వేతనాలు ఇవ్వకుండా వివక్షత చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులలోనూ వివక్షత చూపిస్తున్నారన్నారు. ఐద్వా నాయకులు టి.రాధ మాట్లాడుతూ పనిప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. శ్రామిక మహిళలు ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలన్నారు. సభలో సిఐటియు నగర తూర్పు కమిటీ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం తూర్పు కమిటీ ప్రధాన కార్యదర్శి పి.దీవెనరావు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు రోజమ్మ, విజయలక్ష్మి, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు ఎన్.కెజియా తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జెసి

ప్రజాశక్తి దుగ్గిరాల : రానున్న అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు పోలింగ్ కేంద్రాలను మండలంలోని దుగ్గిరాల, పెనుమూలి, చిలువూరు , మోరంపూడి, మంచికలపూడి, కంఠంరాజు కొండూరు గ్రామాలలో జాయింట్ కలెక్టర్ జి రాజకుమారి మంగళవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో సౌకర్యాలు పరిశీలించిన అనంతరం మండల విద్యాధికారి కె శ్రీనివాసరావుకు అనేక సలహాలు సూచనలు చేశారు. ఎన్నికలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా విద్యుత్ సరఫరా, మరుగుదొడ్లు తదితర అంశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కె రవిబాబు ఎంపీడీవో బి భార్గవి ఈ ఓ పీ ఆర్ డి శ్రీనివాసరావు సూపరింటెండెంట్ రాజేష్ గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమిషనర్

ఎన్నికల సిబ్బంది అందుబాటులో ఉండాలి

- నగర కమిషనర్ కీర్తి చేకూరి

ప్రజాశక్తి-గుంటూరు

ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు, సిబ్బంది పూర్తిగా అందుబాటులో ఉండాలని, ముందస్తు అనుమతి లేకుండా సెలవులు తీసుకోకూడదని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్ఓ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో ఎన్నికల విధుల నిర్వహణపై పశ్చిమ నియోజకవర్గ ఈ.ఆర్.ఓ., అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మీ, ఏఈఆర్‌ఓలు, సూపరిండెంట్లతో మంగళవారం కమిషనర్ చాంబర్‌లో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజికవర్గాల్లో ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఎన్నికల విధులకు కేటాయించే వాహనాలకు జిపిఎస్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎస్.ఈ.ని, అభ్యర్థుల ప్రచార సామాగ్రి ప్రింట్ చేసే ప్రెస్‌లకు ఎన్నికల నిబంధనల మేరకు తీసుకోవాల్సిన చర్యలపై నోటీసులు జారీ చేసి వారితో మీటింగ్ పెట్టాలని సిటీ ప్లానర్‌ని ఆదేశించారు. పోలింగ్ స్టేషన్లలో వీడియో రికార్డింగ్ చేయడానికి తగిన సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. నామినేషన్స్ రిసీవ్ చేసుకునే గదులలో ఎస్.ఈ.తో సమన్వయం చేసుకొని తగిన ఏర్పాట్లు చేయాలని మేనేజర్‌ని ఆదేశించారు. సమావేశంలో ఎస్.ఈ. సుందర్రామిరెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఏఈఆర్‌ఓలు సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కష్ణయ్య, వెంకట లక్ష్మీ, సునీల్, నిరంజన్, ఏడిహెచ్ రామారావు, సూపరిండెంట్లు

సాధారణ బీమా విశ్రాంత ఉద్యోగుల వితరణ

ప్రజాశక్తి-గుంటూరు

విశ్రాంత సాధారణ బీమా మహిళా ఉద్యోగినిలు, సహెూద్యోగుల సహకారంతో స్థానిక బ్రాడీపేట నిర్మల హదయ్ ఆశ్రమంలో 80 ప్లాస్టిక్ కుర్చీలు, అభినందన ఫౌండేషన్‌కు రెండు స్టీల్ బీరువాలు, మానవతా సేవా సమితి వద్ధుల ఆశ్రమానికి డైనింగ్ టేబుల్స్, అనురాగ్ వద్ధుల ఆశ్రమంలోని మహిళలకు డైపర్స్, మాతశ్రీ చిల్డ్రన్ హెూమ్ పిల్లలకు టీవీ అందించారు. వద్ధులు, బాలలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమం కోఆర్డినేటర్స్ ప్రేమజ్యోతి, శారద, సెక్రెటరీ జనరల్ మన్నవ సాంబశివరావు మాట్లాడుతూ సాధారణ బీమా విశ్రాంత ఉద్యోగులు సామాజిక బాధ్యతతో తమకు వచ్చే పెన్షన్‌లో కొంత భాగం పొదుపు చేసి విద్యార్థులకు ఉపకార వేతనాలు, మహిళల ఆర్థిక సహకారం ఇతర సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వాణి, సూర్యకుమారి, భాగ్యలక్ష్మి, శాంతకుమారి, జి.పానకాలరావు పి.సాంబశివరావు, చంద్రశేఖర్, ఎస్.వి.సుబ్బారావు పాల్గొన్నారు.



ఆశ్రమంలో వృద్ధులతో జిఐసి విశ్రాంత ఉద్యోగినులు

ఎన్నికల కోడ్ ఎప్పుడు వచ్చినా సన్నద్ధం : కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాగం సన్నద్ధంగా ఉందని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ చెప్పారు. ఈ మేరకు పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎల్.శివశంకర్ మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఇప్పటి వరకు ఫామ్ 6, 7, 8 అన్నీ కలిపి 56,052 రాగా 32,540 వరకు పరిష్కరించామని, 6, 7 ఫారాల్లో సరైన ఆధారాల్లేని కారణంగా 13,255 దరఖాస్తులను తిరస్కరించామని, బిఎల్వోల వద్ద 7,263 పెండింగ్ ఉన్నాయని వివరించారు. ఈ ప్రక్రియ ఎన్నిక నామినేషన్ ప్రక్రియ జరిగే ముందు రోజు వరకూ ఉంటుందన్నారు. అర్హులెవరైనా ఉంటో ఇప్పటికీ ఓటు నమోదుకు అవకాశం ఉందన్నారు. ఎన్నికల కోడ్ అమలుకు జిల్లాలోని 28 మండలాలకు సంబంధించి ఎంపీడీవోలతో 34 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, పోలింగ్ ప్రక్రియను వీడియో తీసేందుకు 7 పోలీస్, సంబంధిత అధికారులతో వీడియో తీస్తామని పేర్కొన్నారు. ఎన్‌సిసి టీమ్స్, ఫ్లయింగ్ స్క్వాడ్‌ను 33 బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికల కోడ్ రాగానే ఎన్నికల పరిశీలకులతోపాటు రిటర్నింగ్ ఆఫీసర్ తమ కార్యాలయంలో ఒక బోర్డును ఏర్పాటు చేస్తారని, అక్కడే ఎన్నికల అధికారులంతా సమావేశమై ఎన్నికల విషయమై చర్చిస్తారని చెప్పారు. అక్కడ ప్రతి డ్యూటీలో ఏడుగురు సిబ్బంది ఉంటారన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని, మీడియాకూ ఒక గది కేటాయించామని చెప్పారు. ఎక్కడైనా ఈవీఎం, వివి ప్యాట్లు పని చేయకుంటే వాటి స్థానంలో వెంటనే కొత్తవి ఏర్పాటు చేస్తామని, జిల్లాకు అవసరమైన ఎన్నికల సామగ్రితోపాటు 130 శాతం అదనంగా కేటాయించారని తెలిపారు. పలు యాప్‌లను ఎన్నికల కమిషన్ అందుబాటులో తెచ్చిందని, సీనియర్ సిటిజన్స్ కోసం సి విసిట్, సీజర్ యాప్, ఇఎంఎస్, సువిధ యాప్‌లు ఉన్నాయన్నారు. నోటిఫికేషన్ విధులైన తర్వాత సి విజిల్ యాప్ అందుబాటులోకి వస్తుందని, దీనిని ప్రతి ఒక్కరు డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. సి విజిల్ యాప్ ద్వారా వచ్చే సమస్యలపై వంద నిమిషాల్లో స్పందన ఉంటుందని తెలిపారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

సచివాలయంలో ఆకస్మిక తనిఖీ

నరసరావుపేట మండలంలోని అల్లూరువారిపాలెం గ్రామ సచివాలయాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిర్వహణపై తీసుకోవాల్సిన చర్యలను సిబ్బందికి వివరించారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ ప్రసాద్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికా విద్యాభివృద్ధికి బాసటగా కేజీబీవీలు

వచ్చేనెల 11 వరకూ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ



దొండేటి రేవతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

బాలికల విద్యాభివృద్ధికి కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు బాసటగా నిలుస్తున్నాయని జిసిడిఒ దొండేటి రేవతి అన్నారు. మంగళవారం నుండి కెజిబివిలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిన నేపథ్యంలో దరఖాస్తు విధానం దరఖాస్తుకు అర్హులు, ఖాళీలు జాబితా వివరాలను ప్రజాశక్తికి వివరించారు.

బలహీన వర్గాలకు చెందిన బాలికల్లో అక్షరాస్యత శాతం పెంచే లక్ష్యంగా 2004లో ప్రారంభించిన కెజిబివిల్లో తల్లిదండ్రులు లేదా తల్లి కానీ తండ్రి ఎవరో ఒకరిని కోల్పోయిన ఆడపిల్లలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఇవి ఉత్తమ ఫలితాలు సాధిస్తూ సీట్ల కోసం మంత్రులు, ఎమ్మెల్యేలు సైతం సిఫార్సు చేసే స్థాయికి ఎదిగాయని చెప్పారు. కెజిబివిలో సీటు దక్కితే 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు రెసిడెన్షియల్ విద్యను అభ్యసించే అవకాశం ఉందన్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో కెజిబివిలో 6వ తరగతి, ఇంటర్ మొదటి ఏడాది ప్రవేశాలు చేపట్టేందుకు ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, వాటితో పాటు 7, 8, 9 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకీ నోటిఫికేషన్ విడుదల చేసిందని తెలిపారు. ఈనెల 12 నుంచి వచ్చే నెల 11 లోగా ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, అనాథలు, బడి బయట చిన్నారులు, బడి మధ్యలో మానేసిన బాలికలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న బాలికలు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులనివివరించారు.

పల్నాడు జిల్లాలోని 24 కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు 5967 మంది బాలికలు విద్యానభ్యసిస్తున్నారని, ప్రతి కెజిబివిలో 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ మొదటి ఏడాదిలో 40 సీట్లు చొప్పున ఉంటాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 6వ తరగతిలో 960 మంది, ఇంటర్ మొదటి ఏడాది 960 సీట్లను భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చినట్లు తెలిపారు. 7వ తరగతిలో ఖాళీగా ఉన్న 3 సీట్లు, 8వ తరగతిలో 5 సీట్లు, 9వ తరగతిలో 2 సీట్లనూ భర్తీ చేస్తామన్నారు. కరోనా పరిస్థితుల్లో గతేడాది పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం కొంత తగ్గినా ప్రస్తుతం మెరుగైన ఫలితాలు సాధన కోసం పంచతంత్ర (అభ్యసన ప్రణాళిక) ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 100 రోజుల ప్లాన్ పేరిట గతేడాది నవంబర్ 20 నుండి ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు ఇప్పటికే 10 వారాంతపు, 4 గ్రాండ్ పరీక్షలు నిర్వహించి విద్యార్థులలో సామర్థ్యాలను పెంచుతున్నామన్నారు. మెరుగైన వసతులు, విద్యా బోధనతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం ఇస్తున్నట్లు తెలిపారు.

దరఖాస్తుకు కావాల్సిన పత్రాలు

బాలికతో పాటు తల్లిదండ్రుల ఆధార్, రేషన్, కులం, ఆదాయ ధ్రువపత్రాలు. స్టడీ సర్టిఫికెట్, పాస్పోర్ట్ ఫొటోతో పాటు ఫోన్ నంబర్‌తో ఏపికెజిబివి, ఏపిసిఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు 18004258599 టోల్ ఫ్రీ నంబర్ లేదా 9704100406కు సంప్రదించవచ్చు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోలేనివారు తమ సమీపంలోని కెజిబివికు వెళ్లినా దరఖాస్తులు ఆన్లైన్లో నమోదు చేస్తారు.



మాట్లాడుతున్న రాజేష్‌నాయుడు

త్వరలో ఇంటింటికీ పాదయాత్ర : రాజేష్‌నాయుడు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణంలోని బ్యాంకు కాలనీలో వైసిపి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్ఆర్ విగ్రహానికి ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు, పరిశీలకులు చిట్టా విజయభాస్కరరెడ్డి పూలమాలలేశారు. కేక్‌ను కట్ చేశారు. రాజేష్‌నాయుడు మాట్లాడుతూ త్వరలో తాను పట్టణంతోపాటు ప్రతిగ్రామంలో పాదయాత్ర చేస్తానని, ఇంటింటికీ వెళ్తానని, ప్రజల ఆశిస్సులు కావాలని అన్నారు. పేటకు ఎంతో మంది వచ్చిపోతుంటారని, తాను మాత్రం స్థానికంగానే ఉంటానని చెప్పారు.

హోంగార్డు కుటుంబానికి సాయం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అనారోగ్యంతో మరణించిన హోంగార్డు కుటుంబానికి తోటి హోం గార్డులు అండగా నిలిచారు. పిడుగురాళ్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ గతేడాది జూన్‌లో అనారోగ్యంతో మరణించిన సిహెచ్ మరియదాసు కుటుంబానికి హోంగార్డులు తమ ఒకరోజు వేతనం రూ.5 లక్షలను ఇచ్చారు. ఈ మొత్తాన్ని మృతుని కుటుంబానికి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి మంగళవారం అందించారు. ఈ మొత్తాన్ని సమకూర్చిన మిగతా హోం గార్డులను ఎస్పీ అభినందించారు.

ఎలక్ట్రోరల్ బాండ్ల వివరాలను తక్షణం ప్రకటించాలి



ప్రజాశక్తి-సత్తెనపల్లి

ఎలక్ట్రోరల్ బాండ్ల వివరాలను తక్షణమే వెల్లడించాలని, కోర్టు ధిక్కరణకు పాల్పడిన ఎస్‌బిఐపై కేసు నమోదు చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఎస్‌బిఐ బ్రాంచ్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేసి బ్యాంకు మేనేజర్ ఇ.మురళిమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. చలమయ్య మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గత ఎన్నికల్లో ఎలక్ట్రోరల్ బాండ్ల పేరుతో కార్పొరేట్ సంస్థల నుండి పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని అవినీతికి పాల్పడిందన్నారు. ఈ బాండ్లను ఇటీవల సుప్రీంకోర్టు రద్దుచేసి ఈనెల 6వ తేదీల్లోగా వివరాలను వెల్లడించాలని ఎస్‌బిఐని ఆదేశించినా దాన్ని ఎస్‌బిఐ పాటించలేదని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో బిజెపిని గట్టెక్కించేందుకు ఇలా చేసిందన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి డి.విమల, నాయకులక కె.శివదుర్గారావు, జి.ఉమశ్రీ, ఎం.జ్యోతి, జి.రజని, పి.ప్రభాకర్, ఐ.లింగయ్య, జి.మస్తాన్‌రావు, జి.సుసులోవ్ పాల్గొన్నారు.



ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేయగా సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ఎన్నికల బాండ్ల ద్వారా నిధులు సేకరించటం రాజకీయ అవినీతిని చట్టబద్ధం చేయటమేనన్నారు. దేశంలో ఎన్నికల బాండ్ల ద్వారా నిధులు సేకరించని ఏకైక పార్టీ సిపిఎం అని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి టి.శ్రీను, నాయకులు బి.వెంకటేశ్వర్లు, బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మూర్తిరావు ఖోఖలేకు నివాళి

ప్రజాశక్తి - నరసరావుపేట

ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మూర్తిరావు ఖోఖలే, ఆయన భార్య శోభాబాయి మృతికి సంతాపంగా కాలేజీలో మంగళశారం సభ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ షేక్ కరీం మొహిద్దిన్, మేనేజింగ్ డైరెక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ కళాశాల స్థాపించినప్పటి నుంచి దాదాపు పదేళ్లపాటు కళాశాల అభివృద్ధికి మూర్తిరావు ఖోఖలే ఎంతో కృషి చేశారని, ఆయన మరణం దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సభలో కళాశాల చైర్మన్ షేక్ మీరావలి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగశ్రీను రాయల్

పలు ప్రాంతాల్లో వీధిలైట్ల ఏర్పాటు

ప్రజాశక్తి - వినుకొండ

మండలంలోని నడిగడ్డ పంచాయతీ పరిధిలో జనసేన పార్టీ సమన్వయకర్త కొంజేటి నాగ శ్రీను రాయల్ నరసనాయనిపాలెం (పాకాల)లో పర్యటించారు. స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. నడిగడ్డ పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో వీధి లైట్లు లేకపోవడంతో వాటిని ఏర్పాటు చేయించారు. జనసేన మండల అధ్యక్షులు జి.మణికంఠ, కోళ్ల చిన్ని పాల్గొన్నారు.



470 మందికి వైద్యసేవలు

ప్రజాశక్తి - కారంపూడి : ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద వర్గాలకు గొప్ప వరమని ఎంపిపి బి.సావిత్రి అల్లయ్య అన్నారు. మండల కేంద్రమైన కారంపూడిలోని జెడ్‌పి పాఠశాలలో ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం మంగళవారం నిర్వహించారు. నలుగురు ప్రత్యేక వైద్యనిపుణులు 470 మందికి పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. 80 మందికి కంటి పరీక్షలు చేసి కళ్లజోళ్లు అవసరమైన వారిని గుర్తించారు.

రేపు జిల్లా క్రీడా ప్రాంగణంలో కుస్తీ పోటీలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యములో అండర్ - 20 (జూనియర్) స్త్రీ - పురుషుల జిల్లా స్థాయి రెజ్లింగ్ ' (కుస్తీ) ఎంపికలు పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని సత్తెనపల్లి రోడ్డులో ఉన్న జిల్లా క్రీడా ప్రాంగణంలో గురువారం నిర్వహిస్తామని జిల్లా రెజ్లింగ్ అసోసి యేషన్ కార్యదర్శి గుడిపుడి భూషణం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ ఆధార్ కార్డ్ ఓరిజినల్ మరియు జిరాక్స్‌తో హజరు కావాలని 2004, 2005, 2006, 2007 ఏడాదిలో పుట్టిన వారు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8309426350, 9121972179 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రజాశక్తి 7
గుంటూరు జిల్లా
బుధవారం 13 మార్చి 2024

సుందరయ్య నగర్‌లో ఐద్వా ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంళవారం స్థానిక అడవి తక్కెళ్ళపాడులోని సుందరయ్య నగర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఐద్వా, సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక మహిళా సంఘం నాయకులు యం.అచ్యుత కుమారి ఐద్వా జెండా ఆవిష్కరించారు.ఐద్వా నాయకులు బి.సుకన్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐద్వా నగర అధ్యక్షులు జి.రమణ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పార్లమెంట్‌లో మహిళా బిల్‌ను పాస్ చేస్తూ 2029 నుండి అమలు చేస్తామని చెప్పటం మహిళలను మోసం



చేయటమేనని అన్నారు. సమాన పనికి సమాన వేతన చట్టాన్ని అమలు చేయట్లేదన్నారు. నిత్యావసర ఖర్చులు భారీగా పెంచటం వల్ల మహిళలకు ఇంటి ఖర్చులు భారంగా మారాయన్నారు. సిఐటియు నాయకులు ఆది నికల్సన్ మాట్లాడుతూ బిజెపి పాలనలో మహిళలపై వేధింపులు, దాడులు పెరిగాయన్నారు. మహిళల స్వేచ్ఛను హరిస్తూ, మహిళా సాధికారత కోసం కట్టుబడి ఉన్నామని చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. సిపియం స్థానిక శాఖ కార్యదర్శి ఎస్.కె.ఖాసిం షహీద్ మాట్లాడుతూ రూ.400లు ఉన్న గ్యాస్ బండ ధరను రూ.1200లు చేసి ఇప్పుడు వంద రూపాయాలు తగ్గిస్తున్నామని గొప్పగా చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. ఇది ఎన్నికల ఎత్తుగడ అని విమర్శించారు. పిఎన్ఎం నాయకులు జి.లూథర్‌పాల్ గేయాలు అలపించారు. కార్యక్రమంలో ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు నాయుడుపద్మ, షేక్.ఖాజాబి, ఎస్.శ్రీదేవి, ఎస్.పద్మనాభుడు, డి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రత్నాల చెరువులో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి మంగళగిరి :టీడీపీ అధినేత ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ తెలిపారు. మంగళవారం సూపర్ సిక్స్ పథకాలపై మంగళగిరి 21వ వార్డులోని రత్నాల చెరువులో టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో బాబు సూపర్-6 హామీలను ప్రజలకు వివరించడానికి డోర్ టూ డోర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. రత్నాలచెరువులో ఎన్నో ఏళ్లుగా ఇళ్ల పట్టాలు లేని పేదలకు నారా లోకేష్ గెలవగానే పట్టాలిస్తారని దీనివల్ల ప్రజల్లో భరోసా ఏర్పడుతుందన్నారు. నారా లోకేష్ మంగళగిరి నియోజవర్గ ప్రజల కోసం ప్రత్యేకంగా కొండ పోరంబోకు, అటవీ, నీటిపారుదల, దేవాదాయ, రైల్వే భూముల్లో మూడు తరాలుగా ఇళ్లు కట్టుకుని నివాసం ఉంటున్న స్థలాలు రెగ్యులరైజ్ చేయడం, నిరు పేద కుటుంబాలకు 20వేల ఇళ్లు నిర్మించి ఇస్తారని చెప్పారు. కాండ్రు కమల, మురుగుడు హనుమంతరావు నియోజకవర్గ ప్రజలకు ఏం చేశారో ఆలోచించాలన్నారు. కాండ్రు కుటుంబ దోచుకోవడం.. దాచుకోవడం తప్ప నియోజకవర్గ ప్రజలకు చేసిందేమీ లేదని మండిపడ్డారు. ఆ ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి హయాంలో వేసిన రోడ్లకు మరమ్మతులూ చేయలేదు : పెమ్మసాని

ప్రజాశక్తి పొన్నూరు రూరల్

పొన్నూరులోని నిడుబ్రోలు మంగళవారం ఏర్పాటు చేసిన ఎన్నికల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, సంగం డైరీ చైర్మన్ నరేంద్ర కుమార్ మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పొన్నూరులో బాగా దోపిడీ చేశారని ఆయనకు ప్రమోషన్ కల్పించి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గుంటూరు పార్లమెంటు సమన్వయకర్తగా నియమించారని చెప్పారు. తాను, డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ టిడిపి అభ్యర్థులమని, కానీ అంబటి మురళీకృష్ణ, కిలారి వెంకట రోశయ్య సమన్వయ కర్తలని గుర్తుంచుకోవాలన్నారు. కిలారి వెంకట రోశయ్య గుంటూరు ఎంపీ సమన్వయకర్తగా వెళ్ళినప్పటికీ ఇంకా పొన్నూరులో కాసులు ఏరుకుంటున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే రోశయ్య నిసిగ్గగా అధికారులను మధ్యవర్తులుగా పెట్టి బార్ నిర్వాహకులు వద్ద రూ 30 లక్షలు వసూలు చేశారని, గతంలో కూడా పట్నంలోని ఒక్కొక్క బారు యజమాని వద్ద రూ 10 లక్షలు తీసుకుని అవినీతికి పాల్పడ్డారన్నారు. గుంటూరు టిడిపి పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ లోకల్, నాన్ లోకల్ కాకుండా ప్రజలకు వ్యక్తిగతంగా ఏం చేయాలన్నదే లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. వైసిపి ప్రభుత్వం టిడిపి హయాంలో వేసిన రోడ్లకు మరమ్మతులు కూడా చేయలేదని విమర్శించారు. ప్రజల్లో టిడిపి, జనసేనకు విశేష స్పందన, ఆదరణ లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా పొన్నూరు మండలంలో ద్విచక్రవాహన ర్యాలీ, రోడ్‌షో నిర్వహించారు.



నిడుబ్రోలులో మీడియాతో మాట్లాడుతున్న పెమ్మసాని, ధూళిపాళ్ల

ఇంటి పన్నులు వసూలు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి- తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో ఇంటి పన్నులపై ప్రభుత్వం వడ్డీ మాఫీ చేయడంతో మంగళవారం నగర పాలక, సచివాలయ సిబ్బంది నగరంలో ఇంటింటికి తిరిగి ప్రజల వద్ద నుంచి ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారు. స్థానిక ఎల్బీనగర్లో ఆరవ సచివాలయం పరిధిలో కార్పొరేషన్ ఆర్ఐ యశోదరావు ఆధ్వర్యంలో ఆరవ సచివాలయం సిబ్బంది మంగళవారం ఇంటింటికి తిరిగి ఇంటి పన్నులు వసూలు చేశారు. అదే విధంగా ప్రభుత్వం ఇంటి పన్నుల బకాయిలపై వడ్డీ మాఫీ చేసినట్లు సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. నగరంలో 100% ఇంటి పన్నుల బకాయిలు వసూలు చేసే లక్ష్యంగా కార్పొరేషన్, సచివాల యాల సిబ్బంది పనిచేస్తుందని ఆర్ఐ యశోధరరావు అన్నారు.





పరీక్షలు చేస్తున్న సిబార్ వైద్యులు

పెదరావూరులో వరల్డ్ ఓరల్ హెల్త్ డే

ప్రజాశక్తి - తెనాలి

రూరల్ గ్రామం పెద రావూరు లక్ష్మీ కళ్యాణ మంటపం లో మంగళవారం వరల్డ్ ఓరల్ హెల్త్ డే సందర్భంగా తక్కెళ్ళ పాడు సిబార్ దంత వైద్యశాల వైద్యులు ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. జిడిసిసి బ్యాంక్ మాజీ చైర్మన్ మారౌతు సీతారామయ్య, కొడాలి రమణ కూమార్ సారధ్యంలో నిర్వహించిన శిబిరంలో రోగులకు ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కడియాల కృష్ణ కిషోర్ మాట్లాడుతూ వరల్డ్ ఓరల్ హెల్త్ డే సందర్భంగా శిబిరం నిర్వహిస్తున్నామని, దంత సంరక్షణలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దంతాలు ఆరోగ్యంగా ఉంటే, శరీరం కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్ శ్రీనివాస్, డాక్టర్ వినీల్, డాక్టర్ ఫణీంద్ర, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

కెఎల్‌యులో ముగిసిన అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఆంగ్ల భాష సాహిత్యాన్ని విద్యార్థులకు సులువైన పద్దతులలో భోదించాలని కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీ ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ కెవి.దివ్య అన్నారు. మంగళవారం వర్శిటీ ప్రాంగణంలోని న్యూ సెమినార్ హాలులో జరిగిన ఆంగ్ల అంతర్జాతీయ సదస్సు ముగింపు సభలో ఆమె విద్యార్థులు, అద్యాపకులనుద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆంగ్ల భాష పండితులు సదస్సులోపాల్గొని ఆంగ్ల భాష సులువుగా బోధించడం, నేర్చుకోవడం అనే అంశాలపైన ప్రసంగించారు. నాగ్‌పూర్ లోని హిస్‌లాప్ కళాశాల ఇంగ్లీష్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రాంతిక్ బెనర్జీ మాట్లాడుతూ హైడ్రోకార్బన్ యుగంలో చమురు యొక్క కథనాలు పాత మరియు కొత్త రచనలకు పెట్రో ఫిక్షన్ లేదా చమురు సాహిత్యంతో అనుసంధానించబడిన శక్తి మరియు ఆరోగ్య మానవీయ శాస్త్రాలపై దృష్టి సారించే పాప్ టెక్ సంస్కృతి యొక్క యుగం అని ఆయన వివరించారు. న్యూయార్క్ విశ్వ విద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ నికోలస్ బిర్న్స్ మాట్లాడుతూ సాహిత్యంలో సంపూర్ణత, నిరంకుశత్వం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. రాజ్‌కోట్. గుజరాత్ కు చెందిన సౌరాష్ట్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కమల్ మెహతా మాట్లాడుతూ ది రిలెవెన్స్ ఆఫ్ ది అప్లికేషన్ ఆఫ్ ఇండియన్ క్లాసికల్ లిటరరీ థియరీపై ప్రసంగించారు. జార్జ్ ఆర్వెల్ యొక్క యానిమల్ ఫామ్ నవలను ఒక ఉదాహరణగా పేర్కొన్నారు. దీనిని రస ద్వానీ సిద్ధాంతంతో సమర్ధవంతంగా అర్థం చేసుకోవచ్చునని అన్నారు. కార్యక్రమంలో వర్శిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రొఫెసర్ డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎఫ్ఇడి డైరెక్టర్ డాక్టర్ ఎ.జగదీష్, కో ఆర్డినేటర్ డాక్టర్ శివగంగప్రసాద్, జోధ్‌పూర్ కు చెందిన జై నారాయణ్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న అగ్రిగోల్డ్ బాధితులు

అగ్రిగోల్డ్ బాధితులకు తక్షణమే న్యాయం చేయాలి

ప్రజాశక్తి - మంగళగిరి

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయటంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు చిన్ని తిరుపతయ్య విమర్శించారు. మంగళగిరి నగరంలోని వేములపల్లి శ్రీకృష్ణ భవన్ నుంచి అగ్రిగోల్డ్ కస్టమర్ ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పట్నంలో ర్యాలీ నిర్వహించారు. చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే అగ్రిగోల్డ్ బాధితులు అందరికీ న్యాయం చేస్తానని అబద్ధపు హామీలు ఇచ్చి అగ్రిగోల్డ్ బాధితులను మోసం చేశారని ధ్వజమెత్తారు. సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, అగ్రిగోల్డ్ కస్టమర్ ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ కోశాధికారి పి కష్ణారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మూడు నెలల్లో 10, 20, వేల రూపాయల లోపు ఉన్న డిపాజిట్ దారులందరికి మన ప్రభుత్వం రాగానే న్యాయం చేస్తానని చెప్పి పూర్తిగా మోసపు హామీలు ఇచ్చి మోసం చేశాడని మండిపడ్డారు. డిపాజిట్ దారులకు రావలసిన సొమ్మును వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో రాబోయే ఎన్నికల్లో అగ్రిగోల్డ్ బాధితుల ఓట్లతో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని రాష్ట్రం నుంచి తరిమికొడతామని అన్నారు. ఈ నిరసన ర్యాలీ కార్యక్రమంలో అగ్రిగోల్డ్ కస్టమర్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షులు డి చక్రధర్ బాబు, కార్యదర్శి జి గౌరీ శంకర్, భాస్కర్ రావు, ఎస్ కే భాష, శౌరి, జీవి సుధాకర్, జగన్మోహనరావు, రజనీ బాల, సిపిఐ మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రెండవ రోజుకు స్వర్ణకారుల దీక్షలు

ప్రజాశక్తి మంగళగిరి

జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షులు పారేపల్లి మహేష్ ఆధ్వర్యంలో స్వర్ణకారుల రిలే నిరాహార దీక్ష రెండో రోజు మంగళవారం కొనసాగింది. స్వర్ణకారుల సమస్యల సాధనకై అందరూ కలిసికట్టుగా పోరాడాలని స్వర్ణకార కార్పొరేషన్‌ని సాధించుకునే వరకు ఈ ఉద్యమం ఇలాగే కొనసాగుతుందని, రాబోయే రోజుల్లో ఇంకా ఉధతంగా అన్ని పట్టణాలలో స్వర్ణకార సంఘాలు తమ నిరసనలు తెలియజేయబోతున్నారని పారేపల్లి మహేష్ తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం యువజన అధ్యక్షులు కుమ్మర క్రాంతి కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, యువజన కార్యదర్శి కొల్లూరు హనుమంతరావు, గుంటూరు జిల్లా కోఆర్డినేటర్ కాగితాల స్వాతి గౌడ్, మంగళగిరి నియోజకవర్గం అధ్యక్షులు ఉడత శ్రీనివాస్ రావు, జాయింట్ సెక్రటరీ తిరువీధుల కిరణ్, యువజన అధ్యక్షులు అలా శివాజీ యాదవ్, కాట్రు ధనుంజయ్, పట్టణ అధ్యక్షులు మండ్రు సత్యనారాయణ, దామర్ల నారాయణ, నల్లబోతుల లక్ష్మయ్య, ఆలా సాంబయ్య, గుంటూరు పట్టణ అధ్యక్షులు మరియు గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కొమ్మాకుల విజయభాస్కర్, తదితరులు మద్దతు తెలియజేశారు



దీక్షలో పాల్గొన్న స్వర్ణకారులు



గర్భిణులకు శ్రీమంతం నిర్వహిస్తున్న తెలుగు మహిళా నాయకులు

వడ్డేశ్వరంలో 47 మంది గర్భిణులకు సీమంతం

ప్రజాశక్తి, తాడేపల్లి రూరల్

ఎం.టి.ఎం.సి పరిధిలోని వడ్డేశ్వరం గ్రామంలో మంగళవారం సాయంత్రం తెలుగుదేశం సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదన్ రావు సహకారంతో, గ్రామ తెలుగు మహిళలు అధ్వర్యంలో 47 మందికి సామూహిక సీమంతాల కార్యక్రమం జరిగింది. గర్భిణీ స్త్రీలకు పండ్లు, చీరలు పెట్టి శ్రీమంతం వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం గ్రామ అధ్యక్షులు ఈపూరి బాబు, ముమ్మిడి సత్యనారాయణ, దాత కాట్రగడ్డ మధుసూదన్ రావు, టిడిపి రాష్ట్ర నాయకురాలు తమ్మిశెట్టి జానకి దేవి,తెలుగు మహిళ సీనియర్ నాయకులు ఆకుల జయ సత్య, తాడేపల్లి మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు బి.కష్ణవందన, మంచికలపూడి వైష్ణవి, ఎలమంచిలి పద్మ, కొడవటి వాణి, వి. జ్యోతిరాణి, తదితరులు పాల్గొన్నారు.

14,15 తేదీల్లో నీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకునేందుకు తక్కెళ్లపాడు హెడ్‌వాటర్‌వర్క్స్ ప్రధాన పైప్‌లైన్ లీకు మరమ్మతు పనులను ఈనెల 14న ఇంజినీరింగ్ అధికారులు చేపడుతున్నారని, ఆయా పనుల వల్ల నగరంలోని పలు ప్రాంతాల్లో 14, 15 తేదీల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తక్కెళ్లపాడు హెడ్‌వాటర్ వర్క్సకి రావాటర్ సరఫరా చేసే 1000 ఎంఎం డయా పిఎస్సి పైప్‌లైన్‌పై ఏర్పడిన లీకుల వలన నీరు వృధా అవుతుందని, లీకు పనులను వెంటనే చేపట్టకపోతే తాగునీరు వృధా అధికం అవుతుందన్నారు. లీకు మరమ్మతు పనులను గురువారం చేపడతారన్నారు. అలాగే పైప్‌లైన్ ఇంటర్ కనెక్షన్ పనుల వలన గురువారం సాయంత్రం నుండి శుక్రవారం ఉదయం వరకు నగరంలోని నెహ్రునగర్, శారదా కాలనీ, వసంతరాయ పురం, హెచ్.ఎల్.ఆర్., ఐపిడి కాలని, స్తంభాల గరువు, గుజ్జనగుండ్ల, విద్యా నగర్, హనుమయ్య నగర్, నల్లచెరువు, శ్రీనివాసరావు తోట, తారకరామ నగర్, ఏటి అగ్రహారం, బి.ఆర్.స్టేడియం, ఎల్.బి.నగర్, గోరంట్ల, అడవి తక్కెళ్లపాడు, రాజీవ్ గాంధీ నగర్, కోర్ట్ కాంపౌండ్, మిర్చి యార్డ్, హౌసింగ్ బోర్డ్ కాలనీ, కె.వి.పి.కాలని, శ్యామలా నగర్, రెడ్డిపాలెం రిజర్వాయర్ల పరిధిలో పూర్తిగా తాగునీటి సరఫరా నిలిపివేయబడుతుందన్నారు. శుక్రవారం సాయంత్రం నుండి తాగునీటి సరఫరా యధావిదిగా జరుగుతుందన్నారు.ప్రజలు గమనించి జిఎంసికి సహకరించాలని కోరారు.

అమెరికాలో ఇంటర్న్‌షిప్‌కు విజ్ఞాన్ విద్యార్థులు

ప్రజాశక్తి-గుంటూరు


ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులతో లావు రత్తయ్య, తదితరులు

వడ్లమూడి విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు అమెరికాలోని ప్రముఖ అడ్వాన్స్ ఫార్మసీ హాస్పిటల్స్‌లలో ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసబాబు తెలిపారు. ఫార్మా-డి 6వ సంవత్సరం విద్యార్థులు వి.నిస్సీజోసెఫ్, బి.శ్రీలేఖ, ఎస్.కె. దెహనాజ్, ఎ.వెన్నెల అనే 4 విద్యార్థులు అమెరికాలోని ప్రముఖ హాస్పిటల్స్‌లలో 4 వారాల అడ్వాన్స్ ఫార్మసీ ప్రాక్టీస్ ఎక్స్‌పెరిమెంటల్ ట్రైనింగ్ ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారని తెలియజేశారు. అంతేకాకుండా ఈ నలుగురు విద్యార్థులు వచ్చే ఏప్రిల్ 11, 12 తేదీలలో ఓహియోలోని యూనివర్సిటీ ఆఫ్ ఫిండ్లేలో జరగనున్న ఫార్మా-డి సింపోసిజమ్ ఫర్ స్కాలర్‌షిప్ అండ్ క్రియేటివిటీ కాన్ఫరెన్స్‌లో మూడు రీసెర్చ్ పేపర్లు ప్రచురించడానికి అనుమతి లభించిందన్నారు. అమెరికాలో ఇంటర్న్‌షిప్‌తో పాటు రీసెర్చ్ పేపర్లు ప్రజెంట్ చేయడానికి ఎంపికైన విద్యార్థులను విజ్ఞాన్స్ చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసబాబు తదితరులు అభినందించారు.

చెస్‌లో కెఎల్‌పి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు



విద్యార్థుల్ని అభినందిస్తున్న సెక్రెటరీ, ప్రిన్సిపాల్ తదితరులు

ఆనంద్ చెస్ వింగ్స్ అండ్ ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎపి స్టేట్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో డాక్టర్ కెఎల్‌పి విద్యార్థులు ప్రతిభ చూపారని పాఠశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలియజేశారు. పిఎస్‌వి యశ్వంత్ రాజ్‌కుమార్, బి.ప్రజిల్, కె.ప్రణీత, పి.చరణ్, ఎస్‌కె.ఖాజా మొహిద్దీన్, ఎన్.ధర్మిక, ఎస్.కె.హర్షద్ అలీ వరుసగా మొదటి ఏడు స్థానాలు కైవసం చేసుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా సెక్రెటరీ కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ వై.రధినీచౌదరి ఆయా విద్యార్థులను అభినందించారు.

జాతీయ ఒలింపియాడ్‌లో నెహ్రూనికేతన్‌కు ర్యాంకులు

ప్రజాశక్తి తెనాలి



స్థానిక బోస్ రోడ్డు లోని నెహ్రూ నికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు జాతీయ ఒలంపియాడ్ పోటీలలో సత్తా చాటారు. రాష్ట్రస్థాయిలో ర్యాంకులను కైవసం చేసుకున్నారు. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ మురళి కాంత్ దాసరి మంగళవారం వెల్లడించిన వివరాల ప్రకారం సిల్వర్ జోన్ ఫౌండేషన్ గతేడాది గణితంలో నిర్వహించిన జాతీయ ఒలంపియాడ్ లో దాసరి పెర్మిష్టా 179, ఎన్ కరుణశ్రీ 305, సిహెచ్ ఈశ్వర్ బాబు 321, కె.సహస్రద్యుతి 340, సిహెచ్ జయ శ్రీనివాస్ 403, కాజా తరుణి 467 ర్యాంకులను సాధించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను మురళి కాంత్ దాసరి అభినందించారు. సంస్థ పంపించిన మెడల్స్, ప్రశంసా పత్రాలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆశాలకు నియోనేటల్ కేర్ కిట్‌లు అందజేత


కిట్‌లు అందచేస్తున్న డిఎంఅండ్‌హెచ్‌ఒ

ప్రజాశక్తి-గుంటూరు : నవజాత శిశుసంక్షేమం కోసం ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హోం బేస్డ్ నియోనేటల్ కేర్ కిట్‌లను ఆశాలకు మంగళవారం డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ కె.విజయలక్ష్మి వారి ఛాంబర్‌లో అందజేశారు. జిల్లాలో పనిచేస్తున్న 1180 మంది ఆశాలకు కిట్‌లు అందచేసినట్లు చెప్పారు. ప్రతి ఆశా కార్యకర్త ఈ కిట్‌ను బాలింతల ఇంటిని సందర్శించి, కిట్‌లోని ప్రతి ఐటమ్‌ను వివరించి, పిల్లలలో స్పందన పరిశీలించాలన్నారు. స్పందించని పిల్లలను వైద్యాధికారికి రిఫర్ చేయాలన్నారు. కార్యక్రమంలో డిపిహెచ్‌ఎన్‌ఒ షరీఫ్, ఆర్‌సిహెచ్‌డిఇఒ షరీఫ్ పాల్గొన్నారు.

ఎన్ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు సమన్వయంతో పనిచేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు


మాట్లాడుతున్న కలెక్టర్

సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేయటానికి అక్రమంగా నగదు, మద్యం తరలించకుండా ఎన్ఫోర్స్మెంట్ ఏజెన్సీలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎన్ఫోర్స్మెంట్ ఏజెన్సీల నోడల్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ తుషార్ డూడీతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే ఎన్ఫోర్స్మెంట్ ఏజెన్సీలైన ఆదాయపు పన్ను శాఖ, స్టేట్ ట్యాక్స్, సెబ్, ఎక్సైజ్, ఫారెస్ట్, పోలీస్ తదితర శాఖలు ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలు, పార్టీలు, అభ్యర్థుల ఖర్చులు, అనాధికారికంగా తరలించే మద్యం, నగదు, బహుమతులను అరికట్టేందుకు పూర్తి సన్నద్ధతకు ముందస్తుగా చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గాల వారీగా ఎన్ఫోర్స్మెంట్ ఏజెన్సీలు శాఖల వారీగా ప్రత్యేకంగా బృందాలను నియమించి తనిఖీలు నిర్వహించాలని, ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీలను సమన్వయం చేసుకుంటు తనిఖీలలో పట్టుబడిన వాటిని సీజ్ చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై అందిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి ప్రతి రోజు ఎన్నికల సంఘం నిర్దేశించిన ఫార్మేట్ లో వివరాలను జిల్లా ఎన్నికల అధికారికి, జిల్లా ఎస్పీకి, సంబంధిత రిటర్నింగ్ అధికారికి అందించాలన్నారు. సమావేశంలో జిల్లా సెబ్ అధికారి ఎల్ రంగారెడ్డి, జిల్లా ఫారెస్ట్ అధికారి మహబుబ్ బాషా, జిల్లా ఖజనాశాఖ అధికారి రాజగోపాల్, జిల్లా ఆడిట్ అధికారి బి.ధనలక్ష్మీ, స్టేట్ టాక్స్ డిప్యూటీ కమిషనర్ మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిజిహెచ్‌లో ఎండోస్కోపి ద్వారా చికిత్స

చిన్నపేగులో గడ్డ తొలగింపు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి


రోగి బంధువులతో మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

కోత, కుట్టు లేకుండా రోగికి ఎండో స్కోపీ ద్వారా చిన్న పేగులో గడ్డను ప్రభుత్వ ఆసుపత్రి గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు సులభంగా తీసి విజయవంతం చేసారని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ చెప్పారు. మంగళవారం డాక్టర్ కిరణ్ కుమార్ పేషంట్‌కు జరిగిన వైద్య వివరాలను వెల్లడించారు. ప్రకాశం జిల్లా నేరేడు పల్లి గ్రామానికి కి చెందిన గణేశుని కోటమ్మ (56) గత నాలుగు సంవత్సరాల నుంచి కడుపులో నొప్పి, చిన్న పేగులో గడ్డతో బాధపడుతున్నారు. ఈ బాధ నుంచి విముక్తి పొందెందుకు అనేక ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించి లక్షలు ఖర్చు పెట్టారు. ఈ బాధలు భరించ లేక ఈ నెల అయిదో తేదీన ప్రభుత్వ ఆసుపత్రి గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపి కి వచ్చారు. ఆ తర్వాత రోగిని వార్డులోకి చేర్పించి అన్నీ రకాల వైద్య పరీక్షలు చేసారు. ఆచార్యు లు డాక్టర్ కవిత, సహాయ ఆచార్యులు డాక్టర్ నాగూర్ బాషా పరీక్షించి చిన్న పేగులో ఉన్న మూడు సెంటిమిటర్ల గడ్డ ఉందని నిర్ధారించి ఎండో స్కోపి ద్వారా రోగికి భారం పడకుండా డాక్టర్ వై ఎస్ ఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్యం అందించాలని నిర్ణయించారు. ఇటీవల మత్తు వైద్యుల సహకారం తో కేవలం 30 నిమిషాల్లో విజయవంతగా చికిత్స చేసి పేషెంట్‌ను మంగళవారం డిశ్చార్జి చేశామన్నారు. ఈ చికిత్సలో డాక్టర్ శివ రామకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ , డాక్టర్ అనీల్ కుమార్, పీజీ వైద్యులు, మత్తు వైద్యులు డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ పోలయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

పీడీ కార్యాలయంలో వినతి

ప్రజాశక్తి-గుంటూరు


అధికారులకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అంగన్వాడీల సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని కోరుతూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు మంగళవారం స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ కార్యాలయ సూపరింటెండెంట్ మూర్తికి వినతిపత్రం అందజేశారు. అంగన్వాడీ హెల్పర్లు వర్కర్ పోస్టులకు దరఖాస్తు చేసుకొని ఇంటర్వ్యూలు కూడా పూర్తి అయ్యి నెలలు గడుస్తున్నా అపాయింట్మెంట్ ఉత్తర్వుల కోసం నిరీక్షిస్తున్నారని, తక్షణమే అపాయింట్మెంట్ లేఖలు ఇవ్వాలని కోరారు. జిల్లాలోని వివిధ సిడిపిఓ ఆఫీసుల్లో అంగన్వాడి హెల్పర్లకు డ్యూటీలు వేసి, అక్కడ పనిచేయించుకుంటున్నారని, తక్షణమే ఈ విధానానికి స్వస్తి పలకాలన్నారు. జిల్లాలోని కొన్ని ప్రాజెక్టులలో పాత బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. ఈ సందర్భంగా సూపర్నెంట్ స్పందిస్తూ స్పందించి హెల్పర్ల అపాయింట్మెంట్ లెటర్ల పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే సిడిపిఓ ఆఫీసుల్లో హెల్పర్ల డ్యూటీల విషయం కూడా అధికారులతో మాట్లాడతామన్నారు. నల్లపాడు ప్రాజెక్టుకు సంబంధించి ఉన్న బకాయిలపై పరిశీలన చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి పి.దీప్తిమనోజ, నాయకులు రత్న మంజుల, షేక్ బాజీబి, యూనియన్ గౌరవ అధ్యక్షులు వై. నేతాజీ పాల్గొన్నారు.



వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వారికి సత్కారం అందిస్తున్న క్లబ్ సభ్యులు

మహిళల సమగ్రాభివృద్ధికి యునేస్కో క్లబ్స్ కృషి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన అంతర్జాతీయ స్వచ్ఛంద సేవాసంస్థ 'యునెస్కో క్లబ్స్' ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మహిళల విద్య, ఆర్థిక, సామాజిక ఎదుగుదలకు ఎంతగానో కృషి చేస్తున్నాయని ఆ క్లబ్స్ జిల్లా అధ్యక్షులు రామనాథం పరమేశ్వరరావు అన్నారు. జిల్లా యునెస్కోక్లబ్ 27వ వ్యవస్థాపక దినోత్సవంతోపాటు మహిళల విద్యకు విశేషంగా కృషిచేసిన సావిత్రిబాయి పూలే పేరుతో మహిళా దినోత్సవం స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాలలో ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా సమాజంలో వివిధ రంగాలలో విశేషంగా కృషి చేస్తున్న మహిళలకు చీర, పసుపు, కుంకుమ, స్త్రీ శక్తి అవార్డులతో ఘనంగా సత్కరించారు. వివిధ రంగాలలో విశేష కృషి చేసిన పురుషులకు క్లబ్బు వార్షికోత్సవ పురస్కారాలు అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఆర్.జోస్నకుమారి, ఆలిండియా రేడియో డిప్యూటీ డైరెక్టర్ జి.కొండలరావు, విద్యావేత్త ఏ.వి కే సుజాత, క్లబ్ ప్రధాన కార్యదర్శి జే శ్రీనీలత, కోశాధికారి కె.లక్ష్మిశైలజ, డాక్టర్ ఎం.సంతోషికుమారి, డాక్టర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ స్టేషన్‌కు పది పరీక్షా పత్రాలు

ప్రజాశక్తి దుగ్గిరాల

18వ తేదీ నుండి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షా పత్రాలు సెట్ వన్ మంగళవారం స్థానిక పోలీస్ స్టేషనుకు చేరాయి. అధికారుల సమక్షంలో ఈ పత్రాలను భద్రపరిచారు. దుగ్గిరాల మండలంలోని ఐదు పోలింగ్ కేంద్రాలతో పాటు మంగళగిరి రూరల్ మండలంలోని నూతక్కి గ్రామ హైస్కూల్ కు చెందిన పత్రాలను కూడా దుగ్గిరాల పోలీస్ స్టేషన్‌లోనే భద్రపరిచారు. మండల పరిధిలో దుగ్గిరాల బాలురు బాలికల హైస్కూల్ తో పాటు పెదపాలెం, ఈమని, రేవేంద్రపాడు గ్రామానికి చెందిన ప్రశ్న పత్రాలు ఇక్కడ భద్రపరిచారు. మండల వ్యాప్తంగా 665 మంది విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలకు కానున్నారని మండల విద్యాధికారి కె శ్రీనివాసరావు తెలిపారు.